

నర్సీపట్నంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం



రెవెన్యూ అలసత్వం

ప్రజల అర్జీల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం



- భూ సంబంధిత సమస్యలపై పేరుకుపోతున్న వినతులు
- పదే పదే అర్జీలు అందజేయాల్సిన దుస్థితి
- పరిష్కారానికి అవకాశం ఉన్న వాటినీ తిరస్కరిస్తున్న తహసీల్దార్లు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లా రెవెన్యూ శాఖలో ప్రజల సమస్యలకు పరిష్కారం లభించే పరిస్థితి కానరావడం లేదు. మండల తహసీల్దారు కార్యాలయాల్లో భూ సమస్యలు, వివాదాలకు సంబంధించిన అర్జీలు పేరుకుపోతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో భూ సమస్యలపై రైతులు, భూ యజమానులు రెవెన్యూ శాఖకు వేలాదిగా దరఖాస్తులు చేసుకున్నారు. వీటి పరిష్కారంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. వైసీపీ నేతలు సిఫారసుల మేరకు కొంతమంది తహసీల్దార్లు భూ రికార్డుల్లో అడ్డగోలుగా మార్పులు, చేర్పులు చేసి వారికి లబ్ధి చేకూర్చారనే ఆరోపణలు వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం మారింది కాబట్టి తమకు కచ్చితంగా న్యాయం జరుగుతుందని, భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అర్జీలు పెట్టుకున్న వారంతా ఆశతో ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. భూ సమస్యలు, ఆన్‌లైన్ రికార్డుల్లో మార్పులు, చేర్పులపై అందుతున్న దరఖాస్తులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలన చేయకుండానే తిరస్కరిస్తున్నారు. దీంతో అర్జీదారులు అదే సమస్యపై పలు పర్యాయాలు వినతిపత్రాలు అందజేస్తున్నారు.

తహసీల్దారు కార్యాలయాల్లో మారని పరిస్థితులు

కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుతో కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో అందుతున్న అర్జీల్లో సగానికిపైగా రెవెన్యూ శాఖకు సంబంధించినవే వుంటున్నాయి. వీటిల్లో కూడా అత్యధిక శాతం గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినవారే వుంటున్నారు. నిర్ణీత గడువులోగా తమ సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో మళ్లీ మళ్లీ అర్జీలు అందజేస్తున్నారు. భూ సమస్యలపై ఎవరెన్నిసార్లు అర్జీలు అందజేసినప్పటికీ రెవెన్యూ సిబ్బంది మాత్రం సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేసే ధోరణిలో వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ భూ రికార్డుల్లో తమ భూములు 22ఏలో తప్పుగా నమోదయ్యాయని ప్రజలు ఇచ్చిన వినతుల జోలికి రెవెన్యూ సిబ్బంది వెళ్లడం లేదు.

కలెక్టరేట్‌లో గత నెల రోజుల్లో నాలుగు విడతలు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 861 అర్జీలు అందగా వాటిలో 509 అర్జీలు రెవెన్యూ శాఖకు సంబంధించినవి వుండడం గమనార్హం. ఇక మండలస్థాయిలో తహసీల్దార్లకు భూ సమస్యలపై నిత్యం ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. ఈ నెల 11న కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 167 అర్జీలు రాగా, వీటిలో 100 అర్జీలు రెవెన్యూ శాఖకు చెందినవే ఉన్నాయి.

వెబ్‌ల్యాండ్‌లో సాంకేతిక సమస్యలు, ఇతరత్రా కుంటి సాకులు చూపి భూ సమస్యలపై అందిన అర్జీలకు రెవెన్యూ సిబ్బంది పరిష్కారం చూపకుండా తాత్సారం చేస్తున్నారు. భూ సమస్యలపై యజమానుల నుంచి అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి కలెక్టర్ ద్వారా సంబంధిత మండల తహసీల్దార్ల పరిశీలనకు పంపుతుంటారు. వీటిని పరిశీలించి మండల సర్వేయరు, వీఆర్‌ఓ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహసీల్దారు క్షేత్ర పర్యటన చేసి భూమి వివరాలను రెవెన్యూ డివిజన్ అధికారి ద్వారా జాయింట్ కలెక్టర్‌కు పంపుతారు. జాయింట్ కలెక్టర్, కలెక్టర్ తుది నిర్ణయం తీసుకోవాలి. కానీ పలువురు తహసీల్దార్లు ఈ విధంగా చేయడం లేదు. కొంతమంది తహసీల్దార్లు, సర్వేయర్లు.. ఫిర్యాదులో వివరాలపై మొక్కుబడిగా విచారణ జరుపుతున్నారు. మరికొందరు 22ఏ జాబితాలో వున్న వాటిని ప్రభుత్వ భూములుగా పరిగణించి ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా గాల్లో వుంచుతున్నారు. భూ వివాదాలపై అందుతున్న అర్జీలకు తహసీల్దార్లు తమ స్థాయిలో పరిష్కారం చూపే అవకాశం ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. వారసత్వంగా వచ్చిన భూముల వివరాల మ్యుటేషన్, పట్టాదారు పాస్ పుస్తకంలో భూమి విస్తీర్ణం తప్పుగా నమోదుకావడం, వాస్తవ భూ యజమాని పేరుకు బదులు ఇతరుల పేర్లు నమోదు కావడం వంటి చిన్నపాటి సమస్యలకు తహసీల్దార్లు పరిష్కారం చూపడం లేదు.

కలెక్టరేట్‌లో నాలుగు విడతల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల వివరాలు

తేదీ	మొత్తం అర్జీలు	రెవెన్యూ శాఖ అర్జీలు
21-10-2024	232	130
28-10-2024	216	126
04-11-2024	246	153
11-11-2024	167	100

అనకాపల్లి నుంచి మెట్రో కారిడార్



- ప్రభుత్వానికి ఎమ్మెల్యే కొణతాల విజ్ఞప్తి
- శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావన

అనకాపల్లి , నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):

విశాఖ మెట్రో కారిడార్ నిర్మాణాన్ని అనకాపల్లి నుంచి ప్రారంభించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ, అనకాపల్లి మునిసిపాలిటీని 2009లో మెట్రో కారిడార్ కోసం జీవీఎంసీలో విలీనం చేశారని చెప్పారు. ఇది జరిగి 15 సంవత్సరాలు అయినా మెట్రో కారిడార్ కార్యరూపం దాల్చలేదన్నారు. జీవీఎంసీలో విలీనం వల్ల అనకాపల్లి, భీమిలి మునిసిపాలిటీల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. మెట్రో కారిడార్‌ను కూర్మన్నపాలెం నుంచి కొమ్మాది వరకు ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. దీనివల్ల అనకాపల్లి ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో కారిడార్ అనకాపల్లి నుంచి నిర్మించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కనీసం లంకెలపాలెం నుంచి అయినా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఫార్మాసిటీ, సెజ్‌తోపాటు అనకాపల్లి ప్రజలకు కొంతైనా వెసులుబాటు కల్పించినట్లు అవుతుందని రామకృష్ణ అన్నారు.

చలిసింగానికి రోడ్డు నిర్మాణానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ

-వార్త 8వ పేజీలో

ఔషధ తనిఖీలు అంతంతే!

నర్సీపట్నంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కుర్చీ ఖాళీ

- 18 నెలల నుంచి భర్తీకి నోచుకోని పోస్టు
- అనకాపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కి ఇన్‌చార్జి బాధ్యతలు
- వారంలో ఒక రోజు మాత్రమే రాక
- మెడికల్ షాపుల్లో అరుదుగా తనిఖీలు
- ఫార్మా కంపెనీలపై కొరవడిన పర్యవేక్షణ

నర్సీపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):

నర్సీపట్నంలో ఔషధ తనిఖీ అధికారి కార్యాలయానికి ఏడాదిన్నర నుంచి పెద్ద దిక్కు లేకుండా పోయింది. సుమారు 18 నెలల నుంచి ఔషధ తనిఖీ అధికారి పోస్టును ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో ఇన్‌చార్జితో నడుస్తున్నది. గతంలో ఇక్కడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన యుగంధర్‌ని 2023 జూన్ 23న అప్పటి వైసీపీ ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేసింది. కానీ నర్సీపట్నం అధికారిగా ఎవరినీ నియమించలేదు. ఉన్నతాధికారులు అనకాపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకున్నారు. అప్పటి నుంచి అనకాపల్లి, నర్సీపట్నం కార్యాలయాలకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఒక్కరే బాధ్యతలు నిర్వహించాల్సి రావడంతో పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఉన్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. కీలకమైన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉండడంతో మెడికల్ షాపుల్లో తనిఖీలు జరగడం లేదని విమర్శలు వస్తున్నాయి.

నర్సీపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం పరిధిలో నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం, పాయకరావుపేట, నక్కపల్లి, పరవాడ, రావికమతం, రోలుగుంట, ఎలమంచిలి, కశింకోట, ఎస్.రాయవరం మండలాలు వున్నాయి. ఈ మండలాల్లో ఇప్పటికే 400పైగా మెడికల్ షాపులు ఉన్నాయి. కొత్త మెడికల్ షాపులకు లైసెన్స్‌లు మంజూరు, ప్రభుత్వం నిర్దేంచిన ధరల కంటే ఎక్కువకు మందులు అమ్మకుండా చూడడం, నకిలీ లేదా కాలం చెల్లిన మందుల విక్రయాలు జరగకుండా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ చేస్తారు. మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్న మందులు ప్రజల వినియోగానికి సురక్షితంగా ఉన్నాయని, మానవ శరీరంపై ఎటువంటి హానికరమైన భావం ఉండవని నిర్ధారిస్తారు.

24 ఫార్మా కంపెనీలలో ఇన్‌స్పెక్షన్

నర్సీపట్నం కార్యాలయం పరిధిలో నక్కపల్లిలో నాలుగు, పరవాడలో 20 ఫార్మా కంపెనీలు ఉన్నాయి. ఆయా కంపెనీలను తనిఖీ చేసి మంచి ఉత్పాదక అభ్యాస(జీఎంపీ) ధ్రువపత్రం అందజేయాల్సి ఉంటుంది. డబ్ల్యూహెచ్‌వో నాణ్యతా ప్రమాణాల ప్రకారం ఫార్మా కంపెనీల్లో ఉత్పత్తులు స్థిరంగా ఉత్పత్తి చేయబడి, నియంత్రించబడుతున్నాయని నిర్ధారించేందుకు కేంద్ర బృందంతో కలిసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (జీఎంపీ) తనిఖీ చేసి సర్టిఫికెట్ ఇస్తారు. కానీ 18 నెలల నుంచి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో ఫార్మా కంపెనీలపై పర్యవేక్షణ కొరవడింది.

అనకాపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కి ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించినప్పటికీ పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. కంటి తుడుపుగా వారానికి ఒకసారి నర్సీపట్నం వచ్చి వెళుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నర్సీపట్నంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టును భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

కూటమి నేతలకు పదవులు

- గవర, కొప్పుల వెలమ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్‌లలో సభ్యులుగా ఉమ్మడి జిల్లాకు చెందిన 18 మందికి అవకాశం

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం రజక, గవర, కొప్పుల వెలమ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్లకు బుధవారం సభ్యులను నియమించింది. అందులో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 18మంది కూటమి నాయకులకు అవకాశం లభించింది. టీడీపీ, జనసేన, బీజేపీ వర్గాలు ఈ నియామకాలపై హర్షం వ్యక్తంచేస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో గవర సామాజిక వర్గం అధికం. దాంతో గవర కార్పొరేషన్‌లో ఈ ప్రాంతానికి చెందిన వారికే ప్రాధాన్యం లభించింది. గవర కార్పొరేషన్ సభ్యులుగా తెలుగుదేశం పార్టీకి చెందిన పెంటకోట అజయ్‌బాబు (విశాఖ పశ్చిమ నియోజకవర్గం), అల్లా మంగరాజు (నర్సీపట్నం), భీమరశెట్టి శ్రీనివాసరావు (ఎలమంచిలి), బొడ్డేడ నాగ గంగాధర్ (చోడవరం), పొలమరశెట్టి శ్రీనివాసరావు (విశాఖ నార్త్), రవికుమార్ మళ్ల (విశాఖ ఈస్ట్), బొడ్డేడ శ్రీనివాస్ (అనకాపల్లి), వేగి పరమేశ్వరరావు (పెందుర్తి), జనసేన నుంచి విల్లూరి హరికృష్ణ (అనకాపల్లి), బీశెట్టి గోపీకృష్ణ (విశాఖ), బీజేపీ నుంచి విశాఖకు చెందిన బుద్ధా లక్ష్మీనారాయణ నియమితులయ్యారు.

కొప్పుల వెలమ కార్పొరేషన్ సభ్యులుగా టీడీపీ నుంచి లాలం కాశీనాయుడు (పాయకరావుపేట నియోజక వర్గం), చల్లారపు రామ్మోహన్ (విశాఖ వెస్ట్), రొంగలి మహేశ్ (మాడుగుల), జనసేన నుంచి రాజాన సూర్యచంద్ర (నర్సీపట్నం), బీజేపీ నుంచి ఈర్లె శ్రీరామమూర్తి (చోడవరం)ని నియమించారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ సభ్యులు గా టీడీపీకి చెందిన పి.అప్పలరమేశ్ (నర్సీపట్నం), కేవీఎస్ నరేశ్ (విశాఖ నార్త్)ను సభ్యులుగా నియమించారు.

గంజాయి కేసులో ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష

నకిలీ పోలీసు అరెస్టు

- నిందితుడి పాడేరు వాసి
- ఇది వరకే 11 కేసులు

-వార్తలు 8వ పేజీలో

వెలుగులో కుంభకోణంపై విచారణ

చోడవరం కార్యాలయానికి డీఆర్‌డీఏ అధికారులతోపాటు పోలీసులు రాక

- వీవోఏ నుంచి వివరాలు సేకరించిన ఏపీఎం
- బ్యాంకు సిబ్బందితోపాటు వెలుగు సీసీ, మండల అధికారులపై అనుమానాలు
- అక్రమార్కులపై కేసులు, సొమ్ము రికవరీకి చర్యలు

చోడవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని సింహాద్రిపురం పంచాయతీలో డ్వాక్రా మహిళలకు చెందిన రూ.40 లక్షల మేర రుణాల సొమ్మును వీవోఏ స్వాహా చేసిన వైనంపై వెలుగు శాఖ అధికారులతోపాటు పోలీసులు కూడా విచారణ ప్రారంభించారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డైసీ తెలిపారు. అవకతవకలపై పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు, వారి నుంచి సొమ్మును రికవరీ చేస్తామని చెప్పారు. నిధుల స్వాహా వ్యవహారంలో బ్యాంకు సిబ్బంది ప్రమేయం ఉందని తేలితే వారిపై బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

సింహాద్రిపురం పంచాయతీ వెలుగు వీవోఏ వరలక్ష్మి.. సింహాద్రిపురం శివారు పాతిక గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళల పేరుతో సుమారు రూ.15 లక్షల రుణం మంజూరు చేయించి ఆ సొమ్మును తన బినామీ ఖాతాలకు మళ్లించుకున్న వ్యవహారంతోపాటు అదే గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు రుణం చెల్లింపు కోసం ఇచ్చిన డబ్బులు సుమారు రూ.25 లక్షలను స్వాహా చేసిన వైనం స్థానికంగా తీవ్రకలకలం రేపింది. వీవోఏ వరలక్ష్మిపై వెలుగు అధికారుతోపాటు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో వెలుగు సీసీ తాతబాబుతోపాటు గోవాడ స్టేట్ బ్యాంకు అధికారుల పాత్రపైనా అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. డ్వాక్రా సంఘాలకు మంజూరైన రుణం సొమ్మును వారి ఖాతాల నుంచి ఇతరుల ఖాతాలకు మళ్లించడంలో బ్యాంకు అధికారుల పాత్ర కచ్చితంగా వుందని వెలుగు అధికారులు నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. ప్రతి ఒక్క సభ్యురాలి ఖాతాను ఈ-కేవైసీ చేయడంతోపాటు అన్ని వివరాలు బ్యాంకు అధికారుల వద్ద వుంటాయి. సభ్యుల సంతకాలు ధ్రువీకరించుకోకుండా వారి ఖాతాల నుంచి డబ్బులను ఇతర ఖాతాలకు బదలాయించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కేవలం వీవోఏ తెచ్చిన కాగితాలను చూసి ఏకంగా రూ.15 లక్షలను ఇతర ఖాతాలకు ఎలా మళ్లిస్తారని డ్వాక్రా మహిళలు ప్రశ్నిస్తున్నారు. నిధులు స్వాహా వెనుక వీవోఏతోపాటు వెలుగు సీసీ తాతబాబు, మండల స్థాయి అధికారుల పాత్ర కూడా ఉండే అవకాశం ఉందని అంటున్నారు.

ఇదిలావుండగా గతంలో తీసుకున్న రుణాలకు సంబంధించి వాయిదాల చెల్లింపు కోసం వీవోఏకు ఇచ్చిన డబ్బులు తమ ఖాతాలకు జమకాలేదని పలువురు డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. అయితే ఎంతమందికి చెందిన, ఎంత సొమ్ము జమ చేయలేదో విచారణ జరిపి వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో డ్వాక్రా సంఘాల రుణాల పరిస్థితి, రికవరీ వ్యవహారాలపై క్షుణ్ణంగా విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉందని అంటున్నారు.

పోలీసుల విచారణ

డ్వాక్రా రుణాల విషయంలో వెలుగు వీవో ఏ వరలక్ష్మి తమను మోసం చేసిందని ఆరోపిస్తూ సింహాద్రిపురం, పాతిక గ్రామాలకు చెందిన పలువురు డ్వాక్రా మహిళలు మౌఖికంగా ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. బాధితుల నుంచి వివరాలు సేకరించి, వీవోఏను విచారిస్తున్నారు. కాగా సింహాద్రిపురం పంచాయతీలో డ్వాక్రా రుణాలకు సంబంధించి నిధుల స్వాహా వ్యవహారంపై డీఆర్‌డీఏ అధికారులు

... మిగతా 8వ పేజీలో



చోడవరం వెలుగు కార్యాలయం వద్ద పోలీసులు



డ్వాక్రా సభ్యుల రుణాల సొమ్ము స్వాహా చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న వీవోఏ వరలక్ష్మి

ఆ స్టేషన్‌కు ఇక ఒక్కరే ఎస్‌ఐ!

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై సత్వరమే స్పందించిన ఎస్పీ తుహిన్ సిన్హా
- అనకాపల్లి రూరల్ ఎస్‌ఐగా రవికుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనకాపల్లి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌ఐ కేటాయింపు వ్యవహారం ఒక కొలిక్కి వచ్చింది. 'పోలీస్ బదిలీల్లో రాజకీయ జోక్యం' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పందించారు. విశాఖ నుంచి బదిలీపై వచ్చిన రవికుమార్‌ను రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నెలన్నర క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖ సిటీ పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న గుల్లిపల్లి రవికుమార్‌ను అనకాపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా నియమిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సీఐడీలో పనిచేస్తున్న ఇతను రిలీవ్ కావడంలో కాస్త ఆలస్యమైంది. దీంతో అనకాపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా

... మిగతా 8వ పేజీలో

108 సిబ్బంది సమ్మెబాట

- డిమాండ్ల సాధనకు 25వ తేదీ నుంచి విధులు బహిష్కరణ
- జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓలకు ఇప్పటికే సమ్మె నోటీసులు

నర్సీపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):

108 ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి నుంచి విధులు బహిష్కరించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ తరపున జిల్లా కలెక్టర్‌కు, వైద్య ఆరోగ్య శాఖ అధికారికి సోమవారం సమ్మె నోటీసులు అందజేశారు.

జిల్లా వ్యాప్తంగా 108 అంబులెన్స్‌లు 22 ఉన్నాయి. వీటిలో పైలట్లు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌లుగా 103 మంది విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పుడల్లా 108 సర్వీస్ ప్రొవైడర్లు కూడా మారుతున్నారు. నిర్వహణ బాధ్యతల నుంచి వైదొలుగుతున్న సదరు సంస్థలు 108 ఉద్యోగుల గ్రాట్యూటీ, ఆర్జిత సెలవులకు నగదు, వార్షిక ఇంక్రిమెంట్లు వంటివి చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో 108 అంబులెన్స్ సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని, తమకు కూడా ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖలో పోస్టులు భర్తీ చేసేటప్పుడు 108 ఉద్యోగులకు వెయిటేజీ మార్కులు ఇవ్వాలని, 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో జీవో నంబరు 49 ద్వారా జీతంతో సంబంధం లేకుండా 108 సిబ్బందికి సీఎఫ్‌ఎంఎస్ ఖాతా ద్వారా సబ్ ట్రెజరీ నుంచి ప్రతి నెలా రూ.4 వేలు అదనంగా మంజూరు అయ్యేదని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.4 వేల అదనపు అలవెన్స్‌ను ఆపేశారని గుర్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం జీవో నంబరు 49ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. గత 20 రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మె చేయాలని నిర్ణయం తీసుకున్నామని ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మళ్ల శ్రీనివాసరావు తెలిపారు.



108 అంబులెన్స్

సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి : ఎంపీడీవో



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

రాంబిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.జయమాధవి అన్నారు. రాంబిల్లిలో బుధవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. రానున్న ఆర్థిక సవత్సరంలో గ్రామాల అభివృద్ధికి ప్రణాళిలు రూపొందించాలన్నారు. జడ్పీటీసీ ధూళి నాగ రాజు, ఈవోపీఆర్‌డీ బీవీఎస్ రాజు, శిక్షకులు బీవీఎస్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు కరణం రవి తదితరులు

ఎలమంచిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు మునిసిపాలిటీలో చురుగ్గా సాగుతోంది. ఇందులో భాగంగా ఆ పార్టీ నాయకుడు కరణం రవి ఆధ్వర్యంలో యర్రవరం వార్డులో బుధవారం చేపట్టిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో స్వచ్ఛందగా విచ్చేసి సభ్యత్వాన్ని తీసుకున్నారు. అంతకుముందు సభ్యత్వం పొందడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. లక్ష్యానికి మించి సభ్యత్వాలను నమోదు చేయడమే ధ్యేయంగా అంతా కృషిచేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ఎలమంచిలి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాలను గురువారం నుంచి నిర్వహించనున్నట్టు ఎలమంచిలి గ్రం థాలయాధికారి ఆనంద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్టు చెప్పారు. ఉదయం తొమ్మిది గంటలకు పతాకావిష్కరణతో ఈ కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. చివరి రోజున బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలని సీపీఎం ఆందోళన

అచ్యుతాపురం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో కుమారపురంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని ఆరోపిస్తూ వచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించారని ఆరోపించారు. ఇప్పటికైనా ధరల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, సత్తిబాబు, కళ్యాణం, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మరుగుదొడ్లకు ఏడాదిగా తాళం

» అవస్థలు పడుతున్న జనం » మునిసిపల్ సిబ్బంది నిర్వాకంపై పలువురు ఆగ్రహం » త్వరితగతిన వినియోగంలోకి తేవాలని డిమాండ్



ఎలమంచిలి క్రీడామైదానం సమీపంలో ఏడాదిగా తాళం వేసి ఉన్న సామాజిక మరుగుదొడ్లు

ఎలమంచిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ సిబ్బంది నిర్లక్ష్యం పలువురికి ఇబ్బందిగా మారింది. ప్రజలకు అత్యవసరమైన సౌకర్యం విషయంలోనూ అదే పంథాను కొనసాగిస్తుండడం విమర్శలు తావిస్తోంది. ఇందుకు ఇక్కడి సామాజిక మరుగుదొడ్లను ఓ ఉదాహరణగా చెప్పవచ్చు. పట్టణంలోని కొమ్మాయిగుండాన్ని ఆనుకుని ఎనిమిదేళ్ల క్రితం ప్రజా మరుగుదొడ్లను నిర్మించారు. కొన్నేళ్లపాటు వినియోగించిన అనంతరం భవన నిర్మాణం పేరుతో దీనిని తొలగించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు రాజీవ్ గాంధీ క్రీడా మైదానం సమీపంలో సామాజిక మరుగుదొడ్లను నిర్మించారు. దీంతో స్థానికులతో పాటు వివిధ పనులపై ఇక్కడికి విచ్చేసేవారు దీనిని వినియోగించుకునేవారు. కొన్నాళ్ల తరువాత ఇది మరమ్మతులకు గురైందని చెపుతూ అధికారులు తాళాలు వేసి చేతులు దులిపేసుకున్నారు. అప్పటి నుంచి పలువురికి ఇబ్బందులు మొదలయ్యాయి. నిత్యం వినియోగించే సామాజిక మరుగుదొడ్లకు ఏడాదిగా తాళం వేయడంతో స్థానిక ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీ కాదు. గత్యంతరం లేక కొందరు మల మూత్రవిసర్జనకు సమీపంలోని క్రీడామైదానాన్ని గుట్టుచప్పుడు కాకుండా వినియోగిస్తున్నారు. దీంతో ఆ సమీపంలో ఉన్న జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో పాటు పరిసరాలవారు దుర్వాసనను భరించలేకపోతున్నారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన అధికారులే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కనీసం మునిసిపల్ ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించపోవడం ఏమిటని మరి కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, త్వరితగతిన సామాజిక మరుగుదొడ్లకు మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తేవాలని అంతా కోరుతున్నారు.

నేడు కొత్తూరులో గుమ్మడి అమ్మలు ఉత్సవం



రాంబిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు గ్రామంలో గుమ్మడి అమ్మలు పేరంటాల ఉత్సవం గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈమె ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కుటుంబ సభ్యుల ఆరాధ్య దేవత. ఏటా ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటుంటారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టారు. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

చంద్రబాబును కలిసిన 'ప్రగడ'



అచ్యుతాపురం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడును మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. అనంతరం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో చంద్రబాబు ఇచ్చిన పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

సెజ్ పునరావాస కాలనీలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సెజ్ పునరావాస కాలనీలో బుధవారం ఆర్క్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు, ఆర్‌ఏసీఎల్‌డీ సంయుక్త ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.షాలిని మాట్లాడుతూ మహిళలు ప్రధానంగా ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. క్యాన్సర్ రావడానికి గల కారణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రొమ్ము క్యాన్సర్‌పై సెజ్ పునరావాస కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఏసీఎల్‌డి కో-ఆర్డినేటర్ జి.నాని, మాజీ సర్పంచ్ బైలపూడి భవానీ, సుమారు డబ్బై మంది మహిళలు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పూడిమడక గ్రామంలోని సర్వే నంబరు 139లో గల ఉప్పు గల్లీలకు సంబంధించిన మట్టి దిబ్బలను అనుమతులు లేకుండా తవ్వి తీస్తున్న ఓ కంపెనీ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన మత్స్యకార నాయకులు తహీసీల్దార్‌ను కోరారు. పూడిమడక హైస్కూల్ రోడ్డు నుంచి సదరు కంపెనీకి వెళ్లే రోడ్డు విస్తరణకు మట్టిని కాంట్రాక్టర్ తరలిస్తున్నారని వైస్ ఎంపీపీ వి.శ్రీనివాసరావు, మత్స్యకార నాయకులు చేపల శ్రీరాములు, చోడపల్లి అప్పారావు, ఉమ్మిడి అప్పారావు, జగన్ తదితరులు ఆరోపించారు.

కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఆందోళన

రాంబిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) ఇక్కడ నిర్మాణంలో ఉన్న నేవల్ ఆల్టర్నేట్ బేస్ (ఎన్ఏవోబీ)లో మృతి చెందిన ఇద్దరు కాంట్రాక్టు కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని ఎన్ఏవోబీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన యూనియన్ నాయకులతో కలిసి నేవీ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఏవోబీలోని ఐటీడీసీ కంపెనీలో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన వెల్డర్ బప్పుకాన్ బుధవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందాడని కంపెనీ యాజమాన్యం తెలిపిందన్నారు. నేవీలోని మరో నిర్మాణ కంపెనీ అయిన కేఈసీలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు రాజ్‌కుమార్ మండల్ (26) మూడు రోజులు క్రితం మరణించాడని, సదరు వ్యక్తి మృతదేహం దుర్వాసన వచ్చేంతవరకు కంపెనీ యాజమాన్యం గుర్తించకపోవడం దారుణమని వాపోయారు. ఆయా బాధిత కుటుంబాలను అన్నిరంగాల్లో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సిహెచ్.గంగరాజు, అప్పలరాజు డి.కాశియ్య తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో నీటి నాణ్యత పరీక్షలు

» చౌర్యానికి పాల్పడితే రూ.25 వేలు జరిమానా : ఏఈ సుబ్బారావు



కొత్తపేట కాలనీలో కుళాయి వద్ద నీటి నాణ్యత పరీక్షిస్తున్న ఏఈ

ఎలమంచిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో మునిసిపాలిటీలోని అన్ని వార్డుల్లో నీటి నాణ్యత పరీక్షలను చేపడుతున్నామని ఏఈ గణపతి సుబ్బారావు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం కొత్తపేట కాలనీలో కుళాయిల వద్ద నీటి నాణ్యతను పరీక్షించారు. నీటి నాణ్యతలో వ్యత్యాసం ఉంటే ల్యాబ్‌కు పంపించి పరీక్షలు జరుపుతామన్నారు. అనంతరం వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇదిలావుంటే, నీటి చౌర్యానికి ఎవరైనా పాల్పడితే చర్యలు తప్పవన్నారు. వీధి కుళాయిలకు మోటార్లు అమర్చి నీటి చౌర్యానికి పాల్పడితే రూ.25 వేల జరిమానాతో పాటు కుళాయి కనెక్షన్ తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. నీటి పొదుపును అంతా పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : సీఐ



సదస్సులో మాట్లాడుతున సీఐ గణేశ్

అచ్యుతాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ అన్నారు. మత్తు పదార్థాలు- వాటి వినియోగంపై అనర్థాల అంశంపై బుధవారం ఇక్కడి క్రైట్స్ జూనియర్ కళాశాలలో ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాల బారినపడి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, ప్రిన్సిపాల్ నాయుడు, అడిగర్ల శంకరరావుతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.సింహాచలం

రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో 'పేట' విద్యార్థుల ప్రతిభ

పాయకరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో పాయకరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.సింహాచలం, తదితరులు అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సత్యసాయి సేవా సమితి నిర్వహించిన ఈ పోటీల్లో తమ విద్యార్థులు మనోజ్‌కుమార్, ప్రేమ్ కుమార్, బేబీ అద్భుత ప్రతిభ కనబరిచి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి భూమి పూజ



కుమారపురంలో శివాలయం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురం గ్రామంలో బుధవారం శివాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. తపోవనం నిర్వాహకులు సచ్చిదానంద సరస్వతి స్వామీజీ నేతృత్వంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామస్థులు, దాతల సహాయ సహకారాలతో శివాలయం నిర్మిస్తున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యకమంలో పీసీసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాసరావు, నాయకులు నీలాపు బాలకృష్ణరెడ్డి, బక్కిరెడ్డి, రావాడ గోవిందరెడ్డి, మహేష్ రెడ్డి, గోపాలరెడ్డి, వెంకటరెడ్డి, అప్పలరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు

నక్కపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బుధవారం పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ప్రత్యేక ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ దివ్యాంగులైన విద్యార్థులకు పలు ఆటల్లో శిక్షణ ఇచ్చిన అనంతరం ఈ పోటీలు ఏర్పాటు చేశారు. పిల్లలు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు గురువారం బహుమతులు అందజేస్తామనిషేక్ యాస్మిన్ చెప్పారు.

కిశోర్ బాలికలకు ఆరోగ్యంపై అవగాహన

ఎస్.రాయవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం కేజీబీవీ బాలికల పాఠశాలలో కిశోర బాలికలకు బుధవారం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి, గైనకాలజిస్ట్ జయలక్ష్మి మాట్లాడుతూ గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అలాగే బాలికలకు వచ్చే ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జయమ్మ, ఎస్.దేవరాజు పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే పంచాయతీల అభివృద్ధి

» జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి



సర్పంచులు, కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శిరీషారాణి

నక్కపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ముందస్తున్న ప్రణాళికలు ఎంతో దోహదపడుతాయని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల శిక్షణా తరగతుల్లో బుధవారం ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రజావసరాలను గుర్తించి, దశల వారీగా పనులు చేపడితే గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. సంపద కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, ఎంపీడీవో సీతారామరాజు, డీఎల్‌పీవో మూర్తి, ఈవోపీఆర్‌డీ శ్రీను, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపమాకలో తెప్పోత్సవం

» పుష్కరిణి వద్ద ప్రత్యేక పూజలు



పుష్కరిణిలో రాతి మండపం వద్దకు పడవలో వెళ్లి పూజలు చేస్తున్న అర్చకులు

నక్కపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 7 గంటలకు స్వామి వారి పుష్కరిణి, మండపం వద్దకు రాజాధిరాజ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని, ఆంజనేయ వాహనంపై సీతారాములు, శయన పెరుమాళ్ ఉత్సవ మూర్తులను అలంకరించి తీసుకెళ్లారు. అక్కడ పూజలు చేశారు. అనంతరం బోటుపై శయన పెరుమాళ్ ఉత్సవమూర్తిని ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు తెప్పోత్సవాన్ని నిర్వహించారు. పుష్కరిణి మధ్యలో వున్న రాతి మండపం వద్దకు పడవలో స్వామివారి ప్రతిమను తీసుకువెళ్లారు. అక్కడ చిమ్మిడి నివేదన చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ప్రతి ఏటా క్షీరాబ్ది ద్వాదశి రోజు ఉపమాకలో జరిగే తెప్పోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. రాత్రి మాఢవీధుల్లో స్వామివారి తిరువీధి సేవను వైభవంగా నిర్వహించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై అధికారులు, సచివాలయ ఉద్యోగులకు అవగాహన అవసరమని అధికారులు స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సమాచార హక్కు చట్టంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. తాహసీల్దార్ రమేష్‌బాబు, ఇరిగేషన్ డీఈ రాజేంద్ర కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం విషయంలో అందరికీ అవగాహన ఉండాలని చెప్పారు. ఈ చట్టం గురించి పూర్తిగా తెలుసుకుని, మెరుగ్గా అమలుపరచాలని సూచించారు. అంతేకాకుండా సమాచార హక్కుచట్టం ప్రాముఖ్యత, చట్టంలోని సెక్షన్లను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో సౌజన్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ రాఘురామ్

కోటవురట్ల, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో పల్లెల అభివృద్ధి సాధ్యమని ఈవోపీఆర్‌డీ రఘురామ్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికపై బుధవారం సర్పంచులు, ఎంపీటీసీ సభుయలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ఆదాయ వనరులు పెంచుకోవాలన్నారు. భవిష్యత్తులో పంచాయతీలకు కేంద్రం ఇచ్చే నిధులు ఆగిపోయే ప్రమాదం ఉందని, అందువల్ల ఇప్పటి నుంచే ఆదాయ వనరులపై దృష్టిసారించాలని సూచించారు. గ్రామ స్థాయిలో చెరువుల్లో చేపల పెంపకం, యూజర్‌చార్జీలు, వారపు సంతల వేలంపాట, తాగునీటి సరఫరా ద్వారా యూజర్‌చార్జీలు వసూలుచేయడం ద్వారా వనరులు సమకూర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సిద్దాబత్తుల ఉమాదేవి, ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఏవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కాశీనాయుడు



కాశీనాయుడు

కోటవురట్ల, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడును వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కాశీనాయుడుపార్టీ మండల అధ్యక్షుడిగా సుమారు 16 సంవత్సరాలకు పైగా సేవలు అందిస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో విశాఖ ఈస్ట్ నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు నియోజకవర్గానికి ఎన్నికల పరిశీలకుడిగా పనిచేశారు. ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకు మంచి అనుచరుడిగా గుర్తింపు పొందారు. హోం మంత్రి వంగలపూడి అనిత హయాంలో పార్టీకి పదేళ్లుగా సేవలు అందిస్తున్నారు. సీఎం చంద్రబాబు గుర్తించి ఆయన్ను వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేయడంపై నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు చెబుతున్నారు.

మెయిన్ రోడ్డులో ఆక్రమణలు తొలగించాలి

పంచాయతీ పాలకవర్గం తీర్మానం

పాయకరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెయిన్ రోడ్డులో ఆక్రమణలు తొలగించాలని పాయకరావుపేట పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసింది. సర్పంచ్ గారా ఉషశ్రీ అధ్యక్షతన బుధవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ మెయిన్ రోడ్డుకిరువైపులా ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని దీని పరిష్కారానికి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే రాజుగారిబీడులోని పంచాయతీ స్థలంతో పాటు పట్టణంలోని పలు లేఅవుట్లలో స్థలాల ఆక్రమణలు తొలగించి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి పంచాయతీ కార్యదర్శి వర్మ స్పందిస్తూ ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి తొలగింపునకు, పట్టణంలో రోజూ చెత్తను తరలించేందుకు కొత్తగా రెండు ట్రాక్టర్లు కొనుగోలుకు తీర్మానం చేయనున్నట్టు తెలిపారు. అనంతరం అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

పాయకరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతిదులు సహకరించాలని ఈవోపీఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యక్రమంపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు బుధవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల గుర్తింపు, తాగునీరు సరఫరా, వీధిలైట్లు, పారిశుద్ధ్యం మెరుగు తదితర కార్యక్రమాల కోసం అధికారులు ప్రణాళికలు రూపొందిస్తారని, వారికి ప్రజా ప్రతినిధులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏవో సీహెచ్ఆర్‌కే.వర్మ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలు వినియోగించుకోండి

నక్కపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు వినియోగించుకోవాలని ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. మండలంలోని ఉపమాక గ్రామంలో బుధవారం ఏవో ఉమాప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బుజ్జి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలతో సస్యరక్షణ, యాజమాన్య చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మనబాల తాతారావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా బొడ్డేడ నాగగంగాధర్



పార్టీ సేవలకు తగిన గుర్తింపు

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

గవర సామాజికవర్గ సంక్షేమానికి కృషి: గంగాధర్

చోడవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్‌ను రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. బుధవారం ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషన్ డైరెక్టర్ల జాబితాలో నాగగంగాధర్‌కు డైరెక్టర్ పదవి దక్కింది. మండలంలోని రాయపురాజుపేట గ్రామానికి చెందిన గంగాధర్ తాత హనుమంతరావు, తండ్రి వెంకటరమణ తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేశారు. గంగాధర్ తల్లి అచ్చియ్యమ్మ రాయపురాజుపేట పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. ఎంబీఏ, ఎల్ఎల్‌బీ చేసిన గంగాధర్ తాత, తండ్రి వారసత్వంతో 2013లో పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేస్తూ రావడంతో 2014లో టీడీపీ మండల అధ్యక్షుడిగా పదవిని చేపట్టారు. గత పదేళ్లుగా మండల అధ్యక్షుడిగా గంగాధర్ అందిస్తున్న సేవలను అధిష్ఠానం గుర్తించి డైరెక్టర్ పదవిని ప్రకటించింది. కాగా పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లభిస్తుందన్నది అక్షరసత్యమైందని డైరెక్టర్ బొడ్డేడ నాగగంగాధర్ చెప్పారు. తనకు పదవిని ప్రకటించడం చాలా ఆనందంగా ఉందని, సీఎం చంద్రబాబునాయుడు, లోకేశ్‌కు, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. టార్టీ నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతో పాటు డైరెక్టర్‌గా సొంత సామాజిక వర్గం అభ్యున్నతికి పాటుపడతానని ఈ సందర్భంగా గంగాధర్ చెప్పారు.

కార్పొరేషన్ డైరెక్టర్లుగా సూర్యచంద్ర, మంగరాజు



సూర్యచంద్ర, మంగరాజు

నర్సీపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా జన సేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్రను, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా టీడీపీ నుంచి ఆళ్ల మంగరాజును కూటమి ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వారికి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు బుధవారం అభినందనలు తెలిపారు.

కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మహేశ్



కె.కోటపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మహేశ్ నియమితులయ్యారు. కార్పొరేషన్ చైర్మన్‌గా కుమార్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా 15 మందిని కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమించారు. మాడుగుల నియోజకవర్గం నుంచి కె.కోటపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రొంగలి మహేశ్‌ను కొప్పల వెలమ డైరెక్టర్‌గా నియమించారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన హర్షం వ్యక్తం చేశారు.

కన్నుల పండువగా కార్తీక దీపోత్సవం



గౌరీశ్వరాలయం ప్రాంగణంలో వివిధ రూపాలలో భక్తులు వెలిగించిన దీపాలు

చోడవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ స్వయంభూ గౌరీశ్వరాలయం వద్ద కార్తీక మాసం సందర్భంగా బుధవారం రాత్రి దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద భక్తుల సహకారంతో 51 వేల దీపాలను భక్తులు భక్తి శ్రద్ధలతో వెలిగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు. ఓం, స్వస్తిక్, ఓం నమఃశివాయం అలంకరణలతో ప్రధాన రహదారి ప్రారంభం నుంచి ఆలయం వరకూ భక్తులు వేలాది దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మల్లునాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సురేశ్, గూనూరు మూలినాయుడు తదితరులు దీపాలను వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతా శివనామస్మరణతో మారుమోగిపోయింది. కార్యక్రమంలో అర్చకులు కొడమంచిలి చలపతి, స్థానిక నాయకులు సకురు కోటేశ్వరరావు, ఆలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



పార్టీ సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

కె.కోటపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. పార్టీ నేత డోకల లక్ష్మి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రస్తుత సర్పంచ్ ఎర్రంశెట్టి భవానీ సహకారంతో బుధవారం గ్రామంలో వీధివీధికి తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు. మూడు రోజుల్లోనే 700 మంది సభ్యులను చేర్చారు. గ్రామంలోని యాతపేట రామాలయంవీధిలో బుధవారం సభ్యత్వ నమోదు జరిగాయి. కార్యక్రమంలో పార్టీ నాయకులు బండారు ప్రవీణ్, మొల్లి గంగునాయుడు, ఫైలా గంగునాయుడు, ఈర్లి రమేష్, సింగంపల్లి సంతోశ్, బర్ల శ్రీనివాసరావు, రెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...



బీరకవీధిలో సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

దేవరాపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మంబీరక వీధిలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. సభ్యత్వ నమోదు చేయడం వల్ల లభించే ప్రయోజనాలను పార్టీ శ్రేణులు, ప్రజలకు వారు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, సర్పంచ్ పెంటమ్మ, నాయకులు మురళి, సూర్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు



గర్భిణి సంధ్య, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన సేవలు అందిస్తున్నారని తహసీల్దార్ నాగమ్మ చెప్పారు. మండలంలోని కొండశిఖరన ఉన్న గిరిజన గ్రామం పిత్రిగెడ్డలో గర్భిణి కొర్రా సంధ్య వైద్య సేవల కోసం ఆసుపత్రికి రావడానికి నిరాకరించడంతో ఆర్డీవోకు ఫిర్యాదు అందింది. దీంతో తహసీల్దార్ నాగమ్మ, డీటీ శంకరరావు బుధవారం వెళ్లి గర్భిణిని పరామర్శించారు. కిందకు వచ్చి వైద్య సేవలు పొందాలని కోరారు. అలాగే నాణ్యమైన మందులను అందిస్తారని చెప్పడంతో ఈ నెల 20న చేరడానికి సంధ్య హామీ ఇచ్చారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు ఎంతో అవసరం

చీడికాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి ప్రణాళికలు ఎంతో అవసరమని ఎంపీడీవో వి.హేమసుందరరావు అన్నారు. అభివృద్ధి, ప్రణాళికలపై సచివాలయ ఉద్యోగులు, ఉపాధి సిబ్బంది, వెలుగు వీవోఏలతో బుధవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ఆర్థిక వనరుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్‌డీ ఎం.కామేశ్వరరావు, మండల పరిషత్ పర్యవేక్షకుడు ఎల్.కామేశ్వరరావు, టీవోటీలు ఎస్.మణికంఠ, పట్నాలగోపి పాల్గొన్నారు.

పెద్ద చెరువు ప్రాంగణం.. బహు సుందరం

చెత్తాచెదారం తొలగింపు.. ఆహ్లాదకర వాతావరణం

శుభ్రం చేయించి బెంచీలు ఏర్పాటు చేసిన కమిషనర్

త్వరలో సీసీ కెమెరాలు అమర్చడానికి సన్నాహాలు



నర్సీపట్నం పెద్ద చెరువు వద్ద పరిశుభ్రం చేసి బెంచీలు ఏర్పాటు చేసిన దృశ్యం

నర్సీపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్ద చెరువు ప్రాంగణాన్ని బహు సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పరిసరాల్లో చెత్తాచెదారాన్ని తొలగించి ఆహ్లాదకరంగా తయారు చేస్తున్నారు. ఈ విషయంలో మునిసిపల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో సుమారు రూ.4.5 కోట్లతో పెద్ద చెరువును ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయడానికి అప్పట్లో మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడు చర్యలు తీసుకున్నారు. పెద్ద చెరువు, పొలాలు వైపు మెయిన్ రోడ్డుకిరువైపులా రిటర్నింగ్ వాల్స్ నిర్మించారు. శివాలయం దగ్గర నుంచి లారీ యార్డు వరకు రోడ్డు విస్తరణ చేసి బీటీ రోడ్డు వేశారు. ఇంతలో ఎన్నికలు జరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పెద్ద చెరువు ప్రాంతంలో మెయిన్ రోడ్డుకిరువైపులా బహిరంగ మలమూత్ర విసర్జన, చెత్తాచెదారంతో నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లేది. స్థానికులు భవనాలు కూల్చిన కాంక్రీట్ వ్యర్థాలు ఇక్కడే పడేసిపోతుండేవారు. జంతు కళేబరాలు, కోళ్లు, పండ్లు, కూరగాయల వ్యర్థాలు పడేయడంతో దుర్గంధం భరించలేక ఇటువైపు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది.

మునిసిపల్ కమిషనర్ సురేంద్ర ప్రత్యేక దృష్టిసారించి వారం రోజులుగా పెద్ద చెరువు ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నారు. చెత్తాచెదారం పోయకుండా చర్యలు తీసుకున్నారు. ఎక్కువగా చెత్త పోసే ప్రాంతాన్ని గుర్తించి నాలుగు బెంచీలు ఏర్పాటు చేశారు. త్వరలో సీసీ కెమెరాలు అమర్చడానికి చర్యలు తీసుకుంటున్నారు. సీసీ పుటేజీల ఆధారంగా చెత్త పోసేవారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

ప్రభుత్వ భూమిలో ఇసుక నిల్వల పరిశీలన



ప్రభుత్వ ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న గనుల శాఖ అధికారులు

మాకవరపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూముల్లో ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని స్పందనలో అందిన ఫిర్యాదు మేరకు బుధవారం గనులశాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టరు జి.సత్యమూర్తి, రెవెన్యూ అధికారులు ఇసుక నిల్వలను పరిశీలించారు. జంగాలపల్లిలోని సర్పానదికి ఆనుకుని 661 సర్వే నంబరు జి.కోడూరు రెవెన్యూలో సుమారు 16 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని జంగాలపల్లి గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆక్రమించి, అదే భూమిని కొంత మంది ఇసుక వ్యాపారస్తులకు ఎకరా సుమారు రూ.7 లక్షల వరకు అమ్మకాలు జరిపారు. దీంతో గత పది రోజులుగా పగలు కూలీలతోను, రాత్రి సమయాల్లో ఎక్స్‌కవేటర్లతోను ఇసుకను ట్రాక్టర్లకు లోడు చేసి తరలిస్తున్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన కొందరు రైతులు స్పందనకు ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగానే గనుల శాఖ అధికారులు అక్రమ ఇసుక తవ్వకాలను పరిశీలించారు. అయితే వారు మాట్లాడుతూ స్పందన ఫిర్యాదు మేరకు సర్వే చేశామని, తుది రిపోర్టు జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖరు, ఆర్ఐ జట్టి, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని శాఖల అధికారులతో గ్రామ సందర్శన చేపట్టాలి

ప్రజాప్రతినిధుల శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆంజనేయులు

చోడవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికల తయారీకి ముందు ప్రతీ పంచాయతీలో అన్ని శాఖల అధికారులతో కలిసి గ్రామ సందర్శన నిర్వహించాలని ఎంపీడీవో పీవీఎస్ ఆంజనేయులు సూచించారు. పంచాయతీరాజ్ గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖల అధికారులతో కలిసి గ్రామాల్లో సందర్శన సందర్భంగా గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. నిధుల లభ్యత మేరకు ప్రతి పనికీ ఎంత అవసరమో పూర్తి వివరాలతో మాత్రమే నివేదిక తయారు చేయాలని, ఇలా ప్రణాళిక లేకుండా నిధులు ఖర్చు చేయడానికి అవకాశం ఎంత మాత్రం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ప్రణాళికలో గుర్తించిన పనులు మాత్రమే ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ మహేశ్ ప్రజాప్రతినిధులకు పలు అంశాలపై అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, రిసోర్సుపర్సన్ వైకుంఠరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతో పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

రోలుగుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామ పంచాతీయల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు ఎంపీటీసీలు, సర్పంచులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచులు, ఎంపీటీసీలకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల మేరకు వినియోగించుకోవాలని సూచించారు. మండలంలోని 24 పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన ప్రణాళికలకు సంబంధించి నిధులు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మినుము సాగులో విత్తనశుద్ధి తప్పనిసరి

చీడికాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు కోసే ముందు మినుము విత్తనాలు వేసే ప్రతీ రైతు విత్తనశుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి సూచించారు. మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రైతులతో సదస్సు ఏర్పాటుచేశారు. అనంతరం అదే గ్రామంలో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఏవో మాట్లాడుతూ పంట చేతికి వచ్చే ముందు సోకిన తెగుళ్లు, నివారణ చర్యలను వివరించారు. అలాగే మినుము విత్తనాల నాటే విధానం, వరికోతలు కోసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు.

విచిత్ర వేషధారణలో పోటీపడ్డ విద్యార్థులు

నర్సీపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ జిల్లా స్థాయి బాల ప్రతిభా పోటీలలో భాగంగా బుధవారం విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు విచిత్ర వేషధారణలో పోటీ పడ్డారు. ఈ పోటీలో గెలుపొందిన విజేతలకు గురువారం నిర్వహించే బాలల దినోత్సవం సందర్భంగా జ్ఞాపికలు అందజేస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ తెలిపారు.

యాంత్రీకరణలో మెళకువలు తెలుసుకోండి

దేవరాపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ, సమగ్ర సస్యరక్షణలో మెళకువలు తెలుసుకోవాలని కొండెంపూడి వ్యవసాయ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త పి.బాబు తెలిపారు. మండలంలోని కొత్తపెంటలో అనకాపల్లి, విశాఖపట్నం నుంచి వచ్చిన వ్యవసాయ సహాయ సంచాలకులు సబ్రహ్మణ్యం, పి.శ్రీధర్ వరికి సోకే తెగుళ్లపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ రైతులకు పొలానికి వెళ్లి అవగాహన కల్పించారు. యంత్రాలతో వరికోత, వివిధ రకాల యంత్రాల వలన జరిగే ప్రయోజనాలను ఏవో వివరించారు. సర్పంచ్ ఈ కార్యక్రమంలో వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్‌లో రెల్లి కులస్థులకు ప్రాధాన్యత కల్పించాలి

రెల్లి కులం రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు



సమావేశంలో మాట్లాడుతున్న పాపారావు

కె.కోటపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్‌లో రెల్లి కులస్థులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రెల్లివీధిలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్డాది కోటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు పూర్తిస్థాయిలో రెల్లి కులస్థులకు అందేలా చూడాలని కోరారు. సర్పంచ్ భవాని, సంఘం సభ్యులు బి.త్రినాథ్, బి.రవికుమార్, బి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి మాడుగుల సమస్యలు



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మాడుగుల నియోజకవర్గం అత్యంత వెనుకబడి ఉందని, ఇక్కడ మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. మాడుగుల నియోజకవర్గ అభివృద్ధి కోసం రోడ్లు, పరిశ్రమల ఏర్పాటు, యువత రైతుల సమస్యలపై వివరించారు. దీనికి సీఎం చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. మాడుగుల అభివృద్ధికి తప్పకుండా తోడ్పాటును అందిస్తానని మాట ఇచ్చినట్టు ఎమ్మెల్యే బండారు చెప్పారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఏఎల్‌పురం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులు ప్రవల్లిక, పవన్

కృష్ణాదేవిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనిబర్చినట్టు పీడీలు టీవీ రమణ, జి.మాధవి తెలిపారు. ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు విజయనగరం, చింతూరు జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్-14 పోటీల్లో డి.విజయప్రవల్లిక (బాల్ బ్యాడ్మింటన్), లంక పవన్ (వాలీబాల్) సత్తా చాటి రాష్ట్ర స్థాయి జట్లకు అర్హత సాధించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం వరలక్ష్మి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లగుడు రాజులనాయుడు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి



జీపీడీపీపై శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో మేరీరోజీ

గొలుగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీవో మేరీరోజీ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 27 గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై మండలస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అవసరాల నిమిత్తం 2025-26 ఏడాదికి చేపట్టాల్సిన పనులపై ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. గ్రామాలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలంటే ప్రణాళిక అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, మండల స్థాయి అధికారులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక



మాట్లాడుతున్న ఎంపీడీవో

మాకవరపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు సమకూరే నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెలుగు సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ బడ్జెట్‌ను ఏ పనులు ఏ మేరకు చేయాలనేది స్పష్టం తెలియజేశారు. అలాగే ప్రతీ పంచాయతీ బడ్జెట్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మంగ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వూషూ పోటీలకు గురుకుల విద్యార్థిని



విద్యార్థిని పూజిత

నర్సీపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ముత్యాల పూజిత జాతీయ స్థాయి వూషూ పోటీలకు ఎంపికైనట్టు పీడీ నాగదేవర సావిత్రిదేవి తెలిపారు. రాష్ట్రస్థాయి వూషూ పోటీల్లో అండర్-17 విభాగంలో ఆమె బంగారు పతకం కైవసం చేసుకొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ప్రిన్సిపాల్ అనిమిరెడ్డి రాజేశ్వరి, సిబ్బంది అభినందించారు.

రెవెన్యూ గ్రామసభలో 31 వినతులు

కృష్ణాదేవిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాతకృష్ణాదేవిపేటలో బుధవారం జరిగిన గ్రామసభలో 31 వినతులు వచ్చాయని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. వీటిలో పట్టాదారు పాస్ పుస్తకాల్లో విస్తీర్ణం హెచ్చుతగ్గులు, పేర్లు మార్పులుచేర్పుల కోసం ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కొండబాబు, ఆర్ఐ నాగరాజు, సర్వేయర్ సత్యనారాయణ, వీఆర్‌వో శ్రీనివాస్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, ఉప సర్పంచ్ దుంపలపూడి సహదేముడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగేశ్వరావు, కూటమి నాయకులు ఈర్ని చిన్ని, బొడ్డు జమీలు, శివాజీ, మువ్వల వరహాలబాబు, రైతులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు పగడ్బందీగా నిర్వహించాలి

గొలుగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలు పగడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై పీవో, ఏపీవో, సిబ్బందికి బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 13 నీటి సంఘాలు ఉన్నాయని, ప్రతీ సంఘానికి ఆరుగురు సభ్యుల ఎన్ని జరుగుతుందని చెప్పారు. ఈ నెల 23వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు ఎన్నికల నిర్వహణ ప్రారంభమై, మధ్యహ్నం నాలుగు గంటలలోపు సభ్యులు, సంఘ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు ఎన్నిక పూర్తి చేయాలన్నారు. ఓటు వేయడానికి పట్టాదారు పాసు పుస్తకంతో పాటు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఈ శిక్షణలో ఇరిగేషన్ జేఈ రవికిరణ్, ఎంపీడీవో మేరీరోజీ, పలు పాఠశాలల హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించండి

నాతవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ సూచించారు. నాతవరం మండలం చినగొలుగొండపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. బాలింతలకు ఇస్తున్న బియ్యంను పరిశీలించారు. అలాగే చిన్నారులకు అందిస్తున్న ఆహారం నాణ్యతగా ఉందా? లేదానని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరక సత్యనారాయణ, ఎం.దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

జంగాలపల్లిలో పొలం పిలుస్తోంది

మాకవరపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లి పంచాయతీలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో చిరంజీవి మాట్లాడుతూ వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో సేంద్రియ ఉత్పత్తులు, వివిధ పంటల్లో ఏ విధంగా వాడాలనే అంశాలను వివరించారు. రబీ సాగుకు సంబంధించి మినుములు, పెసలు వంటి అపరాల విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో సూరిబాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చోడవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం నుంచి నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి జి.తిరుమలకుమారి తెలిపారు. కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శివాలయంలో భక్తులకు శుద్ధ జలాలు

నర్సీపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కోసం ఆర్వో యూనిట్ అమర్చుతున్నారు. భక్తులకు ఫిల్టర్ వాటర్ అందుబాటులో ఉంచడానికి దినేశ్ మెడికల్స్ యాజమాన్యం సుమారు రూ.35 వేలు ఖరీదు చేసే యూనిట్ ఏర్పాటు చేయిస్తున్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి: ఎస్‌ఐ



వలసగెడ్డలో మాట్లాడుతున్న ఎస్‌ఐ రవీంద్ర

సీలేరు, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాలకు యువత దూరం గా ఉండాలని స్థానిక ఎస్‌ఐ రవీంద్ర అన్నారు. జీకేవీధి మండలం సీలేరు పోలీస్టేషన్ పరిధిలోని దుప్పులవాడ పంచాయతీ వలసగెడ్డ గ్రామాన్ని బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా సందర్శించారు. గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి సాగు, రవాణా వంటి కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, సంఘ విద్రోహ శక్తులకు గ్రా మాల్లో ఆశ్రయం కల్పించరాదన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

వైద్య శిబిరాలు



తీగలమెట్టలో బాలింతకు తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

కొయ్యూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులకు అనుగుణంగా ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని యు. చీడిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్ పలు గ్రామాల ప్రజలకు సూచించారు.బుధవారం పీహెచ్‌సీ పరిధి ఎర్రగొండ, నీలవరం, తీగలమెట్ట గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేశారు. రక్త హీనతతో బాధపడుతున్న బాలింతలు, గర్భిణులకు మందులు అందజేయటంతోపాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో గంగరాజు, ఏఎన్ఎం రాజకుమారి, ఎంఎన్‌వో సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ భూములకు మ్యుటేషన్ చేయించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

చింతపల్లి, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ఆదివాసీలు వారసత్వ భూములను మ్యుటేషన్ చేయించుకోవాలని స్థానిక తహసీల్దార్ బి. రవికుమార్ అన్నారు. బుధవారం మీకోసం కార్యక్రమంలో భాగంగా పలు వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఉన్న 182 రెవెన్యూ గ్రామాల్లో 52 గ్రామాలో ల్యాండ్ రీసర్వే నిర్వహించామన్నారు. 40 గ్రామాల్లో సర్వే పూర్తి స్థాయిలో జరిగిందన్నారు. రీసర్వే జరగని గ్రామాల్లో రెవెన్యూ రికార్డులు సరిచేసే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో ఏళ్ల తరబడి వారసుల పేరిట మారకుండా ఉన్న భూములను మ్యుటేషన్ చేయనున్నట్టు తెలిపారు. మీకోసంలో వచ్చిన భూ సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కుల, ఆదాయ ధ్రువ పత్రాలు సకాలంలో మంజూరు చేస్తామన్నారు.

సీలేరు క్యాంప్ ఏడీగా దుర్గాశ్రీనివాసరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

సీలేరు, నవంబరు 13 , (ఆంధ్ర జ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు ఏపీ జెన్‌కో క్యాంప్ ఏడీగా కె. దుర్గాశ్రీనివాసరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో సీలేరు జెన్‌కో క్యాంప్ ఏడీఈగా పనిచేసిన వెంకటమధుకు మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి బదిలీ కాగా, ఆయన స్థా నంలో విజయవాడ నార్ల తాతాతారావు థర్మల్ పవర్ స్టేషన్‌లో ఏఈఈగా విధులు నిర్వహింస్తున్న దుర్గాశ్రీనివాసరావును ఏడీగా పదోన్నతిపై సీలేరు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు ఇక్కడ ఆయన బాధ్యతలను స్వీకరించారు. క్యాంప్ సెక్షన్ ఏఈఈ సురేశ్, ఇతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా ఈశ్వరరావు

అనంతగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివలింగపురం ఆశ్రమ బాలుర పాఠశాలలో బుధవారం యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక జరిగింది.. అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు, పరిశీలకులు పి. దేముడు, సహా అధ్యక్షుడు ఎస్. రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో యూనియన్ మండల అధ్యక్షుడిగా వి. ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మల్లేశ్వరరావు, తదితరులను సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు ఈశ్వరరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలోని బి.సింహాచలం, బీఎస్ఎన్. పడాల్, రఘు, గంగరాజు, కొండబాబు, సుబ్బారావు, ప్రసాద్, దేముడు, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.



దుంబ్రిగుడలో నిరుపయోగంగా వదిలేసి సంత షెడ్లు



పిచ్చి మొక్కలతో నిండిన పరిసరాలు

వృథాగా..సంత షెడ్లు

- దుంబ్రిగుడలో దుస్థితి.. మరోవైపు రోడ్లపై కూరగాయల విక్రయాలు
- షెడ్లు వినియోగంలోకి తేవాలని కోరుతున్న స్థానికులు

దుంబ్రిగుడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు ఇతర నిత్యావసర సరుకులు విక్రయించేందుకు మండల కేంద్రంలో నిర్మించిన సంత షెడ్లు నిరుపయోగంగా మారాయి. గత ఐదేళ్ల కిందట వరకు ఇక్కడ గురువారం వారపు సంత జరిగేది. అప్పట్లో నిత్యావసర సరుకులు కూరగాయలు విక్రయించేవారి కోసం ఐటీడీఏ సంత షెడ్లు నిర్మించింది. ప్రస్తుతం వాటిని ఎవరూ వినియోగించకపోవడంతో బయట వ్యక్తులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు గ్రామంలో నిత్యం కూరగాయలను వర్తకులు రోడ్డుకు ఇరువైపులా విక్రయిస్తున్నారు. వీరికి సంత షెడ్లు అప్పగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని మండల వాసులు కోరుతున్నారు. అధికారులు స్పందించి సంత షెడ్లు ఈ దిశగా సద్వినియోగమయ్యేలా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.

104 వాహనాల సిబ్బంది సమ్మె నోటీసు



జేసీ అభిషేక్ గౌడ్‌కు వినతిపత్రమిస్తున్న యూనియన్ నాయకులు

పాడేరురూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 108 వాహనాల సిబ్బంది సమస్యలపై ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మె చేపడుతున్నట్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు త్రినాధరావు తెలిపారు. బుధవారం జేసీ అభిషేక్ గౌడు, డీఎంహెచ్‌వో షేక్.జమీల్ బాషాకు ఈ మేరకు సమ్మె నోటీసు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 108 వ్యవస్థలో మార్పు చేస్తున్న ప్రతిసారీ ఈఎంటీ, పైలట్ల గ్రాట్యూటీ, ఎర్నెడ్ లీవ్, వార్షిక ఇంక్రిమెంట్లు చెల్లించకుండా ఆయా సంస్థలు వైదొలుగుతున్నాయన్నారు. ఈ స్థితిలో ప్రభుత్వం తమను వైద్యశాఖలో ఉద్యోగులుగా గుర్తించి 108 వాహనాలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రసాద్, నాగేశ్వరరావు, హఫీజ్, శ్రీను, మురళీ, శ్రీదేవి, ప్రసాద్ తేజ పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

పెదబయలు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 104 సిబ్బంది న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీఎచ్. సూర్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. పలు సమస్యలపై ఈ నెల 1వ తేదీ నుంచి 14 వరకు చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి సిబ్బంది వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ, సుమారు 16 ఏళ్లుగా 104 సిబ్బంది చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జగన్, అజీత్ , తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో రాగులు కొనుగోలు



చోడి పంటను పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాస్‌బాబు

ముంచంగిపుట్టు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా కించాయిపుట్టు, పెదగూడ , బంగారుమెట్ట రైతు సేవా కేంద్రాల్లో రైతులనుంచి రాగులు కొనుగోలు చేయనున్నట్టు ఏవో శ్రీనివాస్ బాబు తెలిపారు. బుధవారం మండలంలోని మాకవరం, పనసపుట్టు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాగులకు క్వింటాకు రూ.4, 290

పెదబయలు: రాగి పంటకు ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను గిరి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో శ్రీనివాస్ కోరారు. మేలైన రాగి క్వింటాకు రూ.4290గా నిర్ణయించినట్టు ఆయన పేర్కొన్నారు. మండలంలోని పీఏసీఎస్‌ల ఆ .ధ్వర్యంలో గంపరాయి, అడుగులపుట్టు రైతు సేవా కేంద్రాల్లో ఈ నెలాఖరు నుంచి కొనుగోళ్లు ప్రారంభించనున్నట్టు చెప్పారు.

సైన్స్ మేళాలో సత్తాచాటిన విద్యార్థులు

పెదబయలు: అరకులో నిర్వహించిన యువజనోత్సవాలు సందర్భంగా నిర్వహించిన సైన్స్ మేళాలో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల- 1 విద్యార్థులు అవినాష్, చంద్రశేఖర్ రూపొందించిన మమతల ఊయల ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి లభించినట్టు జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బాలకృష్ణ తెలిపారు. అలాగే, రాష్ట్ర స్థాయిలో పోటీలకు ఎంపికయ్యారన్నారు. హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు: ఎంపీడీవో

ముంచంగిపుట్టు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 23 పంచాయతీల పరిధిలో ఈ నెల 13వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఉపాధి హామీ పనులకు సంబంధించి 15వ విడత సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శ్రీసాయిహర్ష తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బంది, సామాజిక తనిఖీల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. సామాజిక తనిఖీలలో పాటించాల్సిన నిబంధనలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సంఘంనాయుడు, ఎస్ఆర్‌పీ రాజు, డీఆర్‌పీలు, పీఆర్ ట్రైబల్ వెల్ఫేర్ జేఈలు, టీఏలు, విఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన ప్రాంతంలో సీపీఐకి పూర్వ వైభవం '

చింతపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మన్యంలో సీపీఐకి పూర్వ వైభవం కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సెగ్గె కొండలరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యదర్శి పేట్ల పోతురాజు అధ్యక్షతన మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇరువాడ దేముడు, డి. సతీశ్, కామేశ్వరరావు, చిన్నారావు, చిన్నయ్యదొర, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జాకరవలసను సందర్శించిన అధికారులు



చిన్నారులకు వైద్యపరీక్షలు జరుపుతున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

అరకులోయ, నవంబరు 13:(ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్కీ గ్రామపంచాయతీ జాకరవలసలో కలుషితనీటితో పలువురు చిన్నారులు అస్వస్థత పాలైన నేపథ్యంలో అధికారులు ఆ గ్రామాన్ని బుధవారం సందర్శించారు. పలు వ్యాధుల బారిన పడిన ఈ చిన్నారులు అరకు ఏరియాలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఎంపీడీవో లవరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో బోరుబావి, నీటి పథకం పనితీరును పరిశీలించారు. పారిశుధ్యపనులను ఈ సందర్భంగా పర్యవేక్షించారు. 20 మందికిపైగా చిన్నారులు అస్వస్థత పాలవడంపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. మాడగడ పీహెచ్‌సీ వైద్యులు,సిబ్బంది ప్రత్యేకంగా వైద్యశిబిరం ఏర్పాటుచేసి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. డీఎంహెచ్‌వో బాషాపాల్గొని చిన్నారులకు వైద్య పరీక్షు చేశారు. పాఠశాలను తనిఖీచేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్ ప్రశాంత్, జ్యోతిస్వరూప గ్రామంలో 60 మందికి చికిత్సనందించారు. అధికారులు స్థానిక పాఠశాలకు వెళ్లి విద్యార్థుల ఆరోగ్యంపై వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాలు పరిశీలించారు.

మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి



విద్యార్థినులకు స్వయంగా వడ్డిస్తున్న ఏటీడబ్ల్యూవో వెంకటరమణ

ముంచంగిపుట్టు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనాలను మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని ఎంఈవో కృష్ణమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపురం, బడర పంచాయతీల పరిధిలోని అంటబొంగు, సుత్తిగూడ, లక్ష్మీపురం ఎంపీపీఎస్ పాఠశాలలను, జీపీఎస్ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల హంసబంధ, లక్ష్మీపురం ఆశ్రమ పాఠశాలను ఎంఈవో ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనం అమలు అవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు కె.త్రినాథ్, హెచ్ఎం.మణికంఠేశ్వరరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: ఏటీడబ్ల్యూవో

అనంతగిరి: విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల-2 పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులకు తనే స్వయంగా వండించి, భోజనాన్ని రుచిచుశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెనువెంటనే స్పందించి, వైద్యసేవలను అందించేందుకు హెచ్ఎం, వార్డెన్, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని సూచించారు.పాఠశాల మెట్రిన్ రాజ్యలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

భూగర్భ జలాలను సంరక్షించాలి: ఎంపీపీ



ర్యాలీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గూడెంకొత్తవీధి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉం దని ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. బుధవారంమండల కేంద్రంలో జల ఉత్సవ్‌లో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలన్నారు. నీరును వృథా చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఇమ్మాన్యుయేలు, ఈవోపీఆర్‌డీ పాపారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్ రామ్ పాల్గొన్నారు.

నేడు హుకుంపేట మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మరమ్మతులు చేపడుతున్నందున గురువారం హుకుంపేట మండలంలో అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయాల్లో కార్తీక పూజలు

పాడేరురూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని భక్తులు బుధవారం పట్టణంలోని వివిధ ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, మహిళలు తెల్లవారు నుంచి శివాలయాలు, మోదకొండమ్మ, కనకదుర్గమ్మ ఆలయంతో పాటు షిర్డీ సాయి మందిరాలకు తరలివచ్చారు. మోదకొండమ్మ ఆలయంలో భక్తులకు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిట్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు. ఉమానీలకంఠేశ్వరుని ఆలయం వద్ద ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతుల పర్యవేక్షణలో ప్రతినిధులు కొట్టగుల్లి రామారావు, వంతినిబ రాజుబాబు, సిద్ధినాతి కొండలరావు, బీవీఎస్.ముకుందరావు, శివరాత్రి శ్రీనివాస్‌కుమార్, ఉప్పల వెంకటరత్నం తదితరులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మాలధారులకు నిత్యాన్నదానం

అయ్యప్పస్వామి, శివ, భవానీ మాలధారులకు బుధవారం నుంచి నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించినట్టు గురుస్వామి వెయ్యాకుల సత్యనారాయణ తెలిపారు. వివిధ వ్యక్తిగత పనులపై పాడేరు వచ్చే మాలధారులు మధ్యాహ్న సమయంలో భిక్షకు ఇబ్బంది లేకుండా ఈ అన్నదానం ఉంటుందన్నారు. నీలకంఠానగర్‌లోని పచ్చా రవీంద్ర ఇంటి ప్రాంగణంలో డిసెంబరు 2వ తేదీ వరకు ఈసదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో వై.వెంకటరమణ, ప్రేమ్‌చంద్, లీలాకిశోర్, పోలరాజు, రవీంద్ర, స్వాతి కుమార్, శ్రీనివాస్, రాము, గణేష్, అప్పలరాజు, శేషుబాబు, ప్రకాష్, కొండలరావు, ప్రసాద్, రామారావు పాల్గొన్నారు.



అంబలం పూజలో స్వాములు



భోజనాలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

ఘనంగా అంబలం పూజ

చింతపల్లి: స్థానిక సకలదేవల ఆలయం వీధిలో అయ్యప్ప స్వాములు భక్తిశ్రద్ధలతో అంబలం పూజ నిర్వహించారు.బుధవారంసాయంత్రం పలు గ్రామాలకు చెందిన స్వాములు ప్రత్యేక మండపాన్ని అలంకరించి గురుస్వాములు పైలా శ్రీను, గంపరాయి విజయకుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ నిర్వాహకులు వరహాలు, నానిబాబు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణితో శ్రావణ్‌కుమార్ భేటీ



జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

పాడేరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సంక్షేమ, ఐసీడీఎస్ శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణిని తెలుగుదేశం అరకులోయ పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ మంత్రి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ బుధవారం అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు జీసీసీ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు మంత్రికి కిడారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శ్రావణ్‌కుమార్‌ను సత్కరించారు. మంత్రి సంధ్యారాణి సహకారంతో జీసీసీకి పూర్వవైభవం తీసుకువస్తానని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి: ఎంఈవో

చింతపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో కనీస విద్యా సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో పనసల ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ ఉన్న పాఠశాలలో జరిగిన సరైన స్థాయిలో బోధన (టీఏఆర్ఎల్) శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూడు తరగతి నుంచి ఐదో తరగతి బోధించే ఉపాధ్యాయులకు మూడు విడతల్లో తెలుగు, గణితం పాఠ్యాంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేయాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులు ఎంఈవో, రిసోర్స్ పర్సన్లు కుడుల వెంకట రమణ, బూదరాళ్ల మణిబాబు, మాకెన సత్యనారాయణ, దిబ్బనాయుడులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యూవీగిరి, దేపూరి శశికుమార్, గిడ్డి వరలక్ష్మి, కాంతారావు, కొర్ర ముత్యాలింగం, జర్ర సింహాచలం పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటితోనే ప్రజారోగ్యం



మాట్లాడుతున్న జేజేఎం జిల్లా కోర్డినేటర్ పుల్లయ్య

హుకుంపేట నవంబరు 13 (ఆంధ్రజోతి): సురక్షిత తాగునీటితోనే ప్రజలు ఆరోగ్యం ముడి పడి ఉంటుందని జేజేఎం జిల్లా కోర్డినేటర్ పుల్లయ్య తెలిపారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో జల్ బంధన్ ఉత్సవ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటి వనరుల్లో నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సురక్షిత నీటిని అందించడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చునని అన్నారు. ప్రజలకు ఈ మేరకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ ఈకార్యక్రమంలో ఏవో సన్యాసిరావు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత అంగన్‌వాడీ కుటుంబానికి ఆర్థిక సాయం



అంగన్‌వాడీ కార్యకర్త సీతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీడీపీవో, తదితరులు

కొయ్యూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందినమఠంభీమవరం పంచాయతీ వాలుగూడెం మినీ అంగన్‌వాడీ కార్యకర్త పాంగి సీతమ్మ కుటుంబాన్ని సీడీపీవో విజయకుమారి, సిబ్బంది బుధవారం పరామర్శించారు. ఈసందర్భంగా కొంతమేర ఆర్థిక సహాయం అందచేశారు. గత నెల 30న పాం గి సీతమ్మ ప్రాజెక్టు సెక్టారు సమావేశానికి వెళ్లి, తిరిగి వస్తుండగా రంపచోడవరం సమీపంలో ప్రమాదవశాత్తూ ఆమె ప్రయాణిస్తున్న బైక్ నుంచి కింద పడిమృతి చెందిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నుంచి రావాల్సిన బీమా అందిస్తామని సీడీపీవో ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నేతలు అచ్చియ్యమ్మ, పూర్ణ, చినతల్లి, సూపర్‌వైజర్లు మహాలక్ష్మి, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 12 మంది ఎంపిక

అరకులోయ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ఆర్ఐటీఐలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 12 మంది ఎంపికైనట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి సంగీత, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.రోహిణి తెలిపారు. ఈ జాబ్‌మేళాలో మూడు కంపెనీల ప్రతినిధులు 40 మంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 12 మంది ఎంపికయ్యారన్నారు. వీరికి నియామకపత్రాలు అందజేశారు. ఈ మేళాలో ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యువ ఉత్సవ్ - 2024 విజేతలకు అవార్డులు ప్రదానం



ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అరకులోయ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్-2024 బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నెహ్రూ యువ కేంద్రం విశాఖపట్నంవారు ఈ ఉత్సవం నిర్వహించారు. గ్రూపు కల్చరల్ ప్రోగ్రాం, సైన్స్ మేళా, సైన్స్ మేళా, రచన, ఫొటోగ్రాఫీ, పెయింటింగ్, శిల్పం, వక్తృత్వ తదితర పోటీలు చేపట్టారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన వారికి అవార్డులతో పాటు నగదు పురస్కారాలు అందజేసినట్టు స్థానిక కో-ఎడ్యుకేషన్ కళాశాల, మహిళా కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్, పట్టాసి చలపతిరావు తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన వారు రా ష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేసినట్టు చెప్పారు. ఈ కార్య క్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, నాగబాబు, అనితకుమారి పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



డిగ్రీ విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

పాడేరురూరల్: అరకులో జరిగిన జిల్లా యువజనోత్సవాల్లో ప్రతిభను చూపిన స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్. వనుము చిట్టిబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. టీఎన్ రసూల్ అభినందించారు. కల్చరల్ ఈ వెంట్స్‌లో భాగంగా ఫోక్ డ్యాన్స్‌లో పవన్ గ్రూప్ విద్యార్థులు ద్వితీయ బహుమతి, డిక్లరేషన్ పోటీలో జె.సాయికిరణ్ తృతీయ బహుమతి, ఫొటోగ్రఫీలో పి.జోహాన్ తృతీయ బహుమతి, కవిత్వంలో ఎల్.అజయ్ తృతీయ స్థానంలో నిలిచారు.

సాగు నీటి సంఘాల ఓటరు జాబితాలు సిద్ధం

గూడెంకొత్తవీధి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గుమ్మిరేవుల, చెక్కలమద్ది సాగునీటి సంఘాల ఎన్నికలకు ఓటరు జాబితాలు సిద్ధం చేసినట్టుతహసీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఓటరు జాబితాను ఆయన ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి సంఘాలకు ఎన్నికలు త్వరలో జరగనున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ నీటి సంఘాల పరిధిలో 62 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ జాబితాను ఓటర్లు పరిశీలించుకోవాలని సూచించారు.

జన్‌మన్ గృహాలకు రూ.5లక్షలు ఇవ్వాలి: సీపీఎం

ముంచంగిపుట్టు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ గృహాలకు రూ.5లక్షలు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కె.త్రినాద్ కోరారు. లక్ష్మీపురంలోని సచివాలయం ఆవరణలో ఈ మేరకు గృహాల లబ్ధిదారులు బుధవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా త్రినాధ్ మాట్లాడుతూ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని, సకాలంలో బిల్లులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, నీలకంఠం, హరి, మల్లేశ్ పాల్గొన్నారు.

'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'పై విద్యార్థులకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మాజీ వీసీ ముత్యాలనాయుడు

తుమ్మపాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో బుధవారం ఒకే దేశం.. ఒకే ఎన్నిక అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నన్నయ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు మాట్లాడుతూ విద్యార్థులంతా జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఒకే దేశం.. ఒకే ఎన్నికపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ జయబాబు, ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అప్పారావు, కృష్ణా డిగ్రీ కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి, భరతనాట్యంలో విజేతలకు బహుమతులు


బహుమతులు పొందిన వారితో పోటీల నిర్వాహకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భారత్ వికాస్ పరిషత్ అనకాపల్లి శాఖ ఆధ్వర్యంలో స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య పోటీలు స్థానికులను ఆకట్టుకున్నాయి. భరతనాట్యంలో ప్రథమ, ద్వితీయ బహుమతులను కె.చైత్రిత, బి.కుష్మిత గెలుచుకున్నారు. కూచిపూడిలో కె.రోహిత, బి.హితశ్రీ, వి.మానసవి, జానపదంలో బి.కుష్మిత, కె.చైత్రిత, డి.హితశ్రీ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి పరిషత్ నిర్వాహకులు వంకాయల ఈశ్వరరావు, తాటికొండ రాజారావు, ఓ. ఓం రామ్, రాజేష్‌నాయుడు, ఎస్.గోపాలరావు తదితరులు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా బి.స్పందన వ్యవహరించారు.

'కార్మిక పోరాటాల అణచివేతకు ప్రత్యేక దళం తగదు'

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్మిక పోరాటాల అణచివేతకు ఉద్దేశించి జిల్లా పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక దళాన్ని ఉప సంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. ఇక్కడి యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో కార్మికులు, ప్రజలు తమ సమస్యలపై నిరసన తెలియజేసే హక్కు ఉందన్నారు. దీనికి భిన్నంగా అణచి వేయడానికి 30 మందితో బృందం ఏర్పాటు చేయడం తగదన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యుడు ఎ.రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత ప్రచారం


నెహ్రూచౌక్‌లో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు ప్లకార్డుల ప్రదర్శన

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూచౌక్‌లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రాఫిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. జేఎంజే స్కూల్ విద్యార్థులు తొలుత ఇక్కడికి చేరుకుని ప్లకార్డులు చేతబట్టి వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలను తెలియజేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి కె.రత్నకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రతినిధులు మంజుల, శైలజా, వసంత తదితరులు పాల్గొన్నారు.

'మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి'



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ డీడీ నాయుడు

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రముఖ వైద్యులు డీడీ నాయుడు అన్నారు. బుధవారం స్థానిక దాడి వీరు నాయుడు కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై జరిగిన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు మహాత్మాగాంధీ, స్వామి వివేకానంద, అబ్దుల్ కలామ్ వంటి మహనీయుల జీవిత చరిత్రలను చదవడం ద్వారా గొప్ప స్ఫూర్తిని పొందవచ్చునన్నారు. ప్రతి రోజూ వ్యాయామం చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయామాధురి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండకొప్పాకలో విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అనకాపల్లి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కొండకొప్పాకలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చిల్డ్రన్స్ డేను పురస్కరించుకుని విద్యార్థులకు బుధవారం పలు పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 323 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో లీడర్ దినపత్రిక సంపాదకులు విల్లూరి వెంకటరమణమూర్తి, ప్రధానోపాధ్యాయిని సుమామణి, వైద్యులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలి'



ప్రజా పోరు యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం ప్రజా పోరు యాత్రలో భాగంగా బుధవారం పట్టణంలోని నెహ్రూచౌక్, ఉడ్‌పేట, నరసింగరావుపేట, తహసీల్దార్ కార్యాలయాల ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు గండి నాయనబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు. నాయకులు బి.ఉమా మహేశ్వరరావు, కాళ్ల తేలయ్యబాబు, జి.సుభాషిణి, ఈశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కలవరం రేపుతున్న కల్వర్టులు

- పరవాడ మండలంలోని పలు రహదారుల్లో శిథిలం
- కొన్నిచోట్ల రక్షణ గోడలు కరువు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు


పరవాడ తహసీల్దార్ కార్యాలయం సమీపం జగనన్న కాలనీ వద్ద రహదారిపై కల్వర్టుకు కానరాని రక్షణ గోడ

పరవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రాంతాల్లో కల్వర్టులు భయపెడుతున్నాయి. కొన్నిచోట్ల శిథిలం కాగా, మరిన్నిచోట్ల రక్షణ గోడలు కూలిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణించేవారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని హడలిపోతున్నారు. పలు గ్రామాలకు వెళ్లే రహదారుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. తరుచూ ప్రమాదాలు జరుగుతూ ప్రజలు గాయాల పాలవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఊటగెడ్డ జంక్షన్, భరిణికం, పరవాడ గ్రామాల సమీపంలో గల పలు ఆర్అండ్‌బీ రహదారుల కల్వర్టులు శిథిలమయ్యాయి. వీటికి రక్షణ గోడలు లేని కారణంగా పలువురు వాహనచోదకులు కాలువల్లోకి దూసుకుపోయిన సంఘటనలు ఉన్నాయి. పరవాడ నుంచి భరిణికం వైపు వెళ్లే ప్రధాన రహదారిలోని చిన మల్లోడిగెడ్డ వంతెనపై ఒక వైపు రక్షణగోడ లేదు. అలాగే స్థానిక మండల పరిషత్ కూడలి నుంచి ఇటు పరవాడ, అటు లంకెలపాలెం వైపు వెళ్లే ప్రధాన రహదారిలో గల పలు కల్వర్టులకు ఇరువైపులా రక్షణగోడలు కరువయ్యాయి. పైగా వంతెనల వద్ద మలుపులు ఉండడంతో దగ్గరకు వస్తేనే గాని మలుపులను గుర్తించలేని పరిస్థితి నెలకొంది. రక్షణగోడలు శిథిలమై సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతుల మాట అటుంచితే, కనీసం అధికారులు హెచ్చరిక బోర్డులనైనా ఏర్పాటు చేయలేకపోతున్నారు. మలుపుల వద్ద ఉన్న కల్వర్టులకు రక్షణగోడలు లేకపోవడం మరిన్ని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎలమంచిలి -గాజువాక ప్రధాన రహదారిలోని స్థానిక సినిమాహాల్ జంక్షన్ నుంచి ఊటగెడ్డకు వెళ్లే రహదారిలోని కల్వర్టులకు రక్షణగోడలు దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


ఎలమంచిలి - గాజువాక రూటు పైడిమాంబ ఆలయ సమీపంలో పాడైన కల్వర్టు


ఊటగెడ్డ సమీపంలో కల్వర్టు దుస్థితి

తరుచూ ప్రమాదాలు



కల్వర్టులకు పలుచోట్ల రక్షణ గోడలు లేకపోవడం వలన తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా ద్విచక్ర వాహన చోదకులు గాయాలపాలవుతున్నారు. ఒక్కోసారి తీవ్ర గాయాలపాలై కాళ్లు, చేతులు పోగొట్టుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలి.

- రొంగలి నాగేష్, తానాం

కానరాని హెచ్చరిక బోర్డులు



కల్వర్టులు, ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్న కనీస ఆలోచనను సంబంధిత అధికారులు చేయలేకపోతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరిగి పలువురు గాయాలకు గురవుతున్నారు. హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేస్తే కొంతవరకు ప్రమాదాలను నివారించవచ్చు. ఈ దిశగా ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

- పైలా పైడం నాయుడు, పరవాడ

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు సమష్టి కృషి

- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పిలుపు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనకు సహకరించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా యువతకు పిలుపునిచ్చారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనే ధ్యేయంగా పోలీస్‌శాఖ తలపెట్టిన సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటైన సదస్సులో మాట్లాడారు. యువత మత్తు పదార్థాల జోలికిపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వాలు మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చట్టాలను రూపొందించినట్టు చెప్పారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో పట్టుబడిన నిందితులకు గరిష్ఠంగా 20 సంవత్సరాల వరకు శిక్ష విధిస్తున్నారని వివరించారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్టు తెలిస్తే వాట్సాప్ నంబరు 93929 18196కు సమాచారం అందించాలని కోరారు. అటువంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. సినీ దర్శకుడు నక్కిన త్రినాధరావు మాట్లాడుతూ మత్తు పదార్థాలపై పోలీసులు ఉక్కుపాదం మోపాలన్నారు. నేటి యువత డ్రగ్స్, గంజాయి జోలికి పోకుండా నీతివంతమైన సమాజానికి కృషి చేయాలన్నారు. డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులను గంజాయి ఉచ్చులోకి లాగేందుకు స్మగర్లు ప్రయత్నిస్తుంటారని, అటువంటి వారి ఉచ్చులో పడవద్దని సూచించారు. అనంతరం అంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సదస్సులో జిల్లా మెడికల్ ఆఫీసర్ కృష్ణచంద్ర, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊడేరులో శివుని విగ్రహం ప్రతిష్ఠ



తుమ్మపాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం ఊడేరు గ్రామంలో బుధవారం పరమ శివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన జరిపారు. నాయకులు ఇంటి సూరిబాబు, ఇంటి త్రినాథ్, దండుపాటి గంగరాజు, తాతారావు, తర్రా సూరిఅప్పారావు, సిరసపల్లి శివశంకర్ తదితరులతోపాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ



అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలుచోట్ల ఫుట్‌పాత్‌లు, రోడ్డు పక్కన ఉన్న యాచకులను గుర్తించి జేడీ ఫౌండేషన్, జానకిరామ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయా సంస్థల నిర్వాహకులును దురుపాటి తాతాజీ, వరలక్ష్మి, సభ్యులు ఇరవై మందికి వీటిని అందజేశారు.

విపత్తులపై విద్యార్థినులకు అవగాహన అవసరం : డీఈవో


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

పరవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం జాతీయ విపత్తుల ప్రతిష్టంభన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు తమను తాము ఎలా రక్షించుకోవాలి అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విశాఖపట్నం 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ వై.సత్యనారాయణ ఆధ్వర్యంలో బృందం సభ్యులు విపత్తులు సంభవించినప్పుడు ప్రమాదం నుంచి ఎలా బయటపడాలో అనే విధానాన్ని ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో అప్పారావునాయుడు మాట్లాడుతూ విపత్తులపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనివల్ల భవిష్యత్తులో ఎప్పుడైనా విపత్తులు సంభవిస్తే వాటి నుంచి ఎలా రక్షించుకోవాలో అవగాహన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్, స్థానిక సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, పరవాడ సీఐ మల్లికార్జునరావు, ఎంఈవోలు దివాకర్‌రావు, సాయిశైలజా, హెచ్ఎం రాజశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలావుంటే, మండల కేంద్రం పరవాడ మండల పరిషత్ కార్యాలయం జంక్షన్‌లో గల భవిత కేంద్రాన్ని బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు సందర్శించారు. సమగ్రశిక్ష ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలపై దివ్యాంగుల తల్లిదండ్రులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కేంద్రానికి సీహెచ్.శ్రీనివాసరావు వాటర్ డిస్పెన్సర్ సమకూర్చగా డీఈవో చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల దేవి, ఎంఈవో సాయి శైలజా, ఎంవీ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ మల్లేష్, దివ్యాంగు తల్లిదండ్రులు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు కుమారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

47 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం


సీజ్ చేసిన మద్యంతో ఎస్ఐ మనోజ్

తుమ్మపాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం అక్రమ అమ్మకాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలను చేపడుతున్నట్టు కశింకోట ఎస్ఐ పి.మనోజ్ తెలిపారు. నర్సింగబిల్లి శివారులో కొంతమంది మద్యం అక్రమంగా అమ్మకాలకు పాల్పడుతున్నారన్న సమాచారం మేరకు బుధవారం దాడులు నిర్వహించారు. చింతలపాలెం గ్రామానికి చెందిన చిత్తారు చినఅప్పారావు, మోసయ్యపేట గ్రామానికి చెందిన గుద్దేటి చినరమణలను అదుపులోకి తీసుకుని 47 మద్యం బాటిళ్లను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన


రావాడలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పరవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావాడ గ్రామంలో బుధవారం వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిణి ధనలక్ష్మి రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రావాడ పంచాయతీ పరిధిలో వంద ఎకరాల్లో వరిసాగు చేయడం జరిగిందన్నారు. ధాన్యం సొంత అవసరాలకు వినియోగించుకోగా మిగతా ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా అమ్ముకోవాలని సూచించారు. జీడిమామిడి తోటలు ఉన్న రైతులు ఈనెల పదిహేనులోగా పంటల బీమా ప్రీమియాన్ని చెల్లించాలన్నారు. సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎంఎస్ మూర్తి, వ్యవసాయ సహాయకులు గౌతమి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి

- ప్రజాప్రతినిధుల శిక్షణ శిబిరంలో అధికారుల సూచన


పరవాడలో మాట్లాడుతున్న పంచాయతీ విస్తరణాధికారి ధర్మారావు


సబ్బవరం శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

పరవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు దృష్టిసారించాలని ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీల డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ) సమావేశంలో ఆమె మాట్లాడారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి పంచాయతీల్లో ఏఏ అభివృద్ధి కార్యక్రమాలు అవసరమో వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. అత్యవసర పనులకు తొలి ప్రాధాన్యతం ఇవ్వాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగపరుచుకుని తద్వారా పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. పంచాయతీ విస్తరణాధికారి ధర్మారావు సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు తదితరులతో పాటు అధికారులు పాల్గొన్నారు.

సబ్బవరం : గ్రామాల అభివృద్ధికి ప్రణాళికల రూపకల్పనపై బుధవారం ఇక్కడ అధికారులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి.పద్మజ మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి, ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాల్సి ఉంటుందని వివరించారు. ఈవోపీఆర్‌డీ బి.చైతన్య పంచాయతీలకు విడుదలయ్యే గ్రాంట్లు, ఖర్చు తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో శివరామప్రసాద్, ఎంఈవో లక్ష్మణరావు, వెలుగు ఏపీఎం సీహెచ్.శ్రీనివాసరావులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను ఓలలాడిస్తున్న గాయకులు

సమాజ సేవలో వైజాగ్ బీట్స్

- వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా విశాఖ వేదికగా కార్యక్రమాలు
- పాటల కచేరీ ఆదాయంతో సమాజ సేవ

వారంతా గాయకులు...ఎక్కడెక్కడో స్థిరపడి సామాజిక మాధ్యమాలతో పరిచయాలు పెంచుకున్న ఔత్సాహికులు. తమ గాన మాధుర్యంతో ప్రేక్షకులను ఓలలాడించడమే కాదు..సమాజ సేవలో భాగస్థులు అవుతున్నారు. ఇందుకోసం తమకు తెలిసిన విద్యనే పెట్టుబడిగా పెడుతున్నారు. ఏడాదికి ఒకసారి పాటల కచేరీ నిర్వహించి, దాని ద్వారా ఆర్జించిన మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారు. వైజాగ్ బీట్స్ పేరుతో కళాబృందంగా ఏర్పడి, సేవలో లీనమవుతున్నారు. ఐదేళ్లుగా సాగుతున్న ఈ మహాక్రతువు మరెందరికో ఆదర్శంగా నిలుస్తోంది.



కలిసికట్టుగా పాటలు పాడుతున్న గాయకులు


విశాఖలో కలుసుకున్న వివిధ ప్రాంతాల గాయకులు

(భీమునిపట్నం రూరల్, ఆంధ్రజ్యోతి)

గతంలో గాయకులంతా కలిసికట్టుగా పాడాలంటే ఓ చోట కలుసుకోవాల్సిన పరిస్థితి. కానీ సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తరువాత ఇలాంటి పాటలు పాడేందుకు వివిధ యాప్‌ల ద్వారా అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గాయకుల్లో కొంతమంది ఓ సంఘంగా ఏర్పడి వివిధ కార్యకలాపాలను చేపట్టాలని యోచించారు. తమ వృత్తి, ఉపాధి, ఉద్యోగాలను నిర్వహిస్తూనే సమాజ సేవలో తమ వంతు పాత్ర పోషించాలని భావించారు. దీంతో 'వైజాగ్ బీట్స్' పేరుతో ఉపాధ్యాయులు, న్యాయవాదులు, లెక్చరర్లు, ఇతర వృత్తులలో స్థిరపడిన గాయకులు ఓ సంస్థను ఏర్పాటుచేశారు. దీనికి డాక్టర్ కె.శారద అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పడినప్పటికీ, వివిధ ప్రాంతాలలో వీరు సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు.

ఐదేళ్లుగా కార్యకలాపాలు

మొట్టమొదటిసారిగా వీరు 2019 అక్టోబరు 20న కలుసుకుని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పాట ద్వారా సమాజానికి మేలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సమావేశానికి 40 మంది హాజరయ్యారు. సినీ సంగీత దర్శకులు మాధవపెద్ది సురేశ్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఆ తర్వాత 2021 ఏప్రిల్ 11న నగరంలోకి ద్వారకా ఇన్ హోటల్‌లో పాటల కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ సమయంలో కరోనా కారణంగా ప్రత్యేక జాగ్రతలు తీసుకుని విభావరిని నిర్వహించారు. ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంనకు కార్యక్రమాన్ని అంకితం చేశారు. అనంతరం 2022 జనవరి 2న సవేరా ఫంక్షన్ హాలులో 55 మంది గాయకులతో సంగీత విభావరి నిర్వహించి వచ్చిన ప్రవేశ రుసుం సుమారు రూ.35 వేలను అంధ విద్యార్థులకు విరాళంగా అందించారు. అదే ఏడాది సెప్టెంబరు 11న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 60 మంది గాయకులతో నిర్వహించిన కార్యక్రమానికి సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వచ్చిన మొత్తం రూ.25 వేలు సన్‌ఫ్లవర్ పాఠశాలకు అందించారు. ఈ ఏడాది ఏప్రిల్ 28న పోతినమల్లయ్యపాలెం వైజాగ్ కన్వెన్షన్ హాలులో 70 మంది గాయకులతో సినీ సంగీత దర్శకుడు గంటాడి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కచేరికి ప్రేక్షకుల ఆదరాభిమానాలు లభించాయి. దీంతో లభించిన రూ.50 వేలను నిరుపేద కళాకారులకు విరాళంగా ఇచ్చారు. రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సంగీత విభావరులు ఏర్పాటు చేయలేని సమయంలో గాయకులు కలిసికట్టుగా పాడిన పాటలకు యూట్యూబ్ ద్వారా ప్రచారం కల్పిస్తున్నామని నిర్వాహకురాలు శారద తెలిపారు.


నిరుపేద కళాకారులకు రూ.50 వేల చెక్కును అందిస్తున్న వైజాగ్ బీట్స్ ప్రతినిధులు (ఫైల్ ఫొటో)

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529


మోదకొండమ్మను దర్శించుకున్న హీరోయిన్ మీనాక్షిచౌదరి


మీనాక్షి చౌదరిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మాడుగుల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హీరోయిన్ మీనాక్షిచౌదరి మాడుగులలో సందడిచేశారు. ప్రస్తుతం అరకు ప్రాంతంలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేశ్ హీరోగా నటిస్తున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా షూటింగ్ జరుగుతున్నది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న మీనాక్షి చౌదరి బుధవారం మాడుగుల మోదకొండమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, సభ్యులు కలిసి సన్మానించారు.

చలిసింగానికి రోడ్డు నిర్మాణానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ

చోడవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చోడవరం నియోజకవర్గం రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ పరిధిలోని చలిసింగం గిరిజన గ్రామానికి రహదారి నిర్మాణానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. అమరావతిలో మంగళవారం డిప్యూటీ సీఎంను కలిసిన రాజు, చలిసింగం గ్రామ ప్రజలు దశాబ్దాలుగా రహదారి సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులను వివరించారు. రహదారి నిర్మాణం విషయంలో అటవీ శాఖ అభ్యంతరాలను పవన్ కల్యాణ్ దృష్టికి తెచ్చారు. అటవీ శాఖ అభ్యంతరాలు తొలగించి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం.. అటవీ శాఖ అనుమతులతోపాటు, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరుకు అంగీకరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఇతర సమస్యలను కూడా పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకుని వెళ్లినట్టు రాజు తెలిపారు.


డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం అందించి, చలిసింగం రహదారి సమస్యను వివరిస్తున్న పీవీఎస్ఎన్ రాజు

దొన్నుదొరకు సాదర స్వాగతం

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విజయనగరం జోన్ ఛైర్మన్‌గా నియమితులైన సివేరి దొన్నుదొర బుధవారం విశాఖ వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, ఆర్టీసీ కార్మికులు, వివిధ మండలాల అధ్యక్షులు, పంచాయతీల సర్పంచ్‌లు, తెలుగుదేశం పార్టీ నాయకులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.


కుతున్న ఆర్టీసీ అధికారులు, టీడీపీ నేతలు

పోస్టల్ ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు

దేవరాపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చింతలపూడి బ్రాంచి పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్న దాసరి సత్య ప్రవీణ్(23) అదృశ్యమైనట్టు అతని తండ్రి లోవరాజు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డు అన్నవరానికి చెందిన ప్రవీణ్ ఉద్యోగ రీత్యా దేవరాపల్లిలో సహోద్యోగి దేముడునాయుడుతో కలసి ఉంటున్నాడు. జెరాక్సులు తీసుకొని వస్తానని చెప్పి మంగళవారం వెళ్లి తిరిగి రాక పోవడం, సెల్ ఫోన్ గదిలో విడిచి పెట్టడంతో దేముడునాయుడు, లోవరాజు తండ్రికి సమాచారం అందించారు. ఆయన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెలుగులో కుంభకోణంపై విచారణ

... 5వ పేజీ తరువాయి

శాఖాపరమైన విచారణ ప్రారంభించారని, దీనిపై ఆ శాఖ అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని చోడవరం సీఐ పి.అప్పలరాజు చెప్పారు.

ఇదిలావుండగా డ్వాక్రా సభ్యుల రుణాల సొమ్ము స్వాహాకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న వరలక్ష్మి బుధవారం మధ్యాహ్నం ఇక్కడ వెలుగు కార్యాలయానికి వచ్చి, ఏపీఎం తిలక్‌కు రుణాల వివరాలు అందించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించడంతో డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ డైసీ సింహాద్రిపురం, పాతిక గ్రామాల్లో డ్వాక్రా మహిళలను కలిసి వివరాలు సేకరించారు.

రుణాల స్వాహాపై సమగ్ర విచారణ

డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ డైసీ



డ్వాక్రా సంఘాల రుణాల సొమ్ము స్వాహా వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ డైసీ తెలిపారు. బుధవారం ఇక్కడ వెలుగు కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన వారిపై కచ్చితంగా చర్యలు తీసుకోవడంతోపాటు, వారి నుంచి సొమ్ము రికవరీకి చర్యలు చేపడతామని చెప్పారు. అవసరమైతే క్రిమినల్ చర్యలకు పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో బ్యాంకు సిబ్బంది ప్రమేయం ఉందని తేలితే వారిపై బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆమె వివరించారు.

ఆ స్టేషన్‌కు ఇక ఒక్కరే ఎస్ఐ!

... 5వ పేజీ తరువాయి

పనిచేస్తున్న వి.సత్యనారాయణ తనకున్న రాజకీయ పలుకుబడితో రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ఎటాచ్‌మెంట్ ఉత్తర్వులు విడుదల చేయించుకున్నారు. అప్పటి నుంచి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తొలుత బదిలీ ఆర్డర్ పొందిన ఎస్ఐ రవికుమార్ మూడు రోజుల క్రితం అనకాపల్లి వచ్చి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఒక స్టేషన్‌లో ఇద్దరు ఎస్ఐలు వుండడంతో సిబ్బంది, వివిధ పనులపై పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో ఎస్పీ తుహిన్ సిన్హా వెంటనే స్పందించారు. రవికుమార్‌ను రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతోపాటు వి.సత్యనారాయణకు గతంలో జారీ చేసిన ఎటాచ్‌మెంట్ ఉత్తర్వులను రద్దు చేశారు.

క్రైం... crime news

గంజాయి కేసులో ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష

చోడవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేసులో ముద్దాయికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ బుధవారం స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎ.రత్నకుమార్ తీర్పు ఇచ్చారు. చీడికాడ మండలం దిబ్బపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తాడి రాజు 2013 అక్టోబరు 10వ తేదీన తన ఆటోలో గంజాయి రవాణా చేస్తూ చీడికాడ పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పటి ఎస్ఐ విశ్వనాథం 90 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, తాడి రాజును అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితుడిపై మోపిన నేరం వాస్తవమని రుజువు కావడంతో జడ్జి రత్నకుమార్ పదేళ్ల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండున్నర సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉగ్గిన వెంకటరావు కేసును వాదించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జిపైన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ కెటీఆర్ లక్ష్మి తెలిపారు. బుధవారం గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామన్నారు. మృతుని వయసు 55 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, ఎత్తు 5.5 అడుగులు ఉంటుందన్నారు. చామనఛాయ రంగు కలిగి నీలం రంగు చొక్కా, నేవీ బ్లూ కలర్ ఫుల్‌ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుని ఆచూకీ తెలిసినవారు సెల్ నంబరు 7382058996కు సమాచారమివ్వాలని ఎస్ఐ కోరారు.

చెట్టుకు ఉరివేసుకొని కార్మికుడి ఆత్మహత్య


రాజ్‌కుమార్ మండల్ (ఫైల్ ఫొటో)

రాంబిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా ఉన్న ఎన్ఏఓబీ కొండపై చెట్టుకు ఉరివేసుకొని ఓ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పశ్చిమబెంగాల్‌కు చెందిన రాజ్‌కుమార్ మండల్(26) ఏడాది కాలంగా ఎన్ఏఓబీలోని కేఈసీ కంపెనీలో కాంట్రాక్టు లేబర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం అతను నేవీ కొండపై చెట్టుకు ఉరివేసుకొని వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. అక్కడ ఉన్న అడ్మిన్ మేనేజర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు వెళ్లి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఇతను రెండు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చునని ఎస్ఐ తెలిపారు. .

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట, నవంబరు 13 : స్థానిక రాజీవ్‌కాలనీ వద్ద బుధవారం రైలు పట్టాలు దాటుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మధ్యాహ్నం పాయకరావుపేటలోని రాజీవ్‌కాలనీ ఎదుట రైల్వే వంతెన కింద రైలు పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తి(35)ని తుని నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తుని ప్రభుత్వ రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీ రూమ్‌లో భద్రపరిచామని, వివరాలు తెలిసినవారు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

బావిలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య

పాడేరురూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బతుకు తెరువు కోసం పాడేరుకు వచ్చిన ఓ వ్యక్తి కొత్తపాడేరు సమీపంలో పంటపొలాల మధ్య ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఎ.సూర్యనారాయణ అందించిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా అన్నవరం సమీపంలోని పారుపాక గ్రామానికి చెందిన సారిపల్లి గంగరాజు(52)ను కుటుంబ సభ్యులు పట్టించుకోకపోవడంతో కూలిపనుల కోసం నాలుగు నెల క్రితం పాడేరు వచ్చాడు. ఇక్కడా సరైన పని లభించకపోవడంతో మనస్తాపం చెందిన ఆయన మంగళవారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. బుధవారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నకిలీ పోలీసు అరెస్టు

- నిందితుడి పాడేరు వాసి
- ఇది వరకే 11 కేసులు


పోలీస్ దుస్తుల్లో వెంకటరమణ

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పోలీసును పీఎం పాలెం పోలీసులు అదుపులోకి తీసుకొని ఆరిలోవ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన వంతల వెంకటరమణ (33) పోలీసు యూనిఫారం ధరించి జాతీయ రహదారిపై డెయిరీ ఫాం వద్ద సెల్‌ఫోన్లు అమ్మేందుకు యత్నిస్తుండగా, స్థానికులు అనుమానించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పీఎం పాలెం క్రైం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. కాగా, వంతల వెంకటరమణపై ఇది వరకే సబ్బవరం పీఎస్‌లో పలు కేసులు నమోదై ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మల్లేశ్వరరావు వెల్లడించారు.

లింగాపురంలో చోరీ

కోటవురట్ల, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): లింగాపురంలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. 2.25 తులాల బంగారం, రూ.5 వేల నగదు అపహరణకు గురైంది. దీనికి సంబంధించి ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. లింగాపురం గ్రామానికి చెందిన చింతలనాగరాజు, భార్య వరలక్ష్మి కోటవురట్ల ప్రభుత్వాస్పత్రి సమీపంలో నూడిల్స్ వ్యాపారం చేస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం రాత్రి 7 నుంచి 9 గంటల మధ్యలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బంగారం, నగదు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నరసింగరావుపేట దుర్గాలడ్డి వీధికి చెందిన రిటైర్డు ఉద్యోగి అద్దంకి శ్రీనివాసరావు అదృశ్యమైనట్టు బుధవారం ఫిర్యాదు అందిందని పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. శ్రీనివాసరావు బుధవారం వేకువజామున గాంధీనగరంలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి బయలుదేరి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆయన కుమారుడు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.